

మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 267 | సోమవారం 05 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3









## ఏపీలో 'తల్లికి వందనం'..

రెండో విడతకు రంగం సిద్ధం

సుమారు 3.29 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.13,000 జమ

ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం.. సీఎంవో అనుమతి కోసం నిరీక్షణ

వచ్చే వారం లేదా రెండు వారాల్లో నిధులు విడుదలయ్యే అవకాశం 2లో

# 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు

## చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

- రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ
- బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు
- 2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు
- ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్

2లో

ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



9 లక్షల ఇళ్లకు కేంద్రం హామీ | 3 లక్షల ఇళ్లతో శ్రీకారం | 3డీ టెక్నాలజీతో నిర్మాణం

## మధ్యప్రదేశ్‌కే కాదు.. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ



బుర్రిపాలెంలో 3 లక్షల పీఎంఏవై ఇళ్లకు భూమి పూజ

రాష్ట్రానికి దశలవారీగా 9 లక్షల ఇళ్లు మంజూరు చేస్తామన్న కేంద్రం

దేశంలోనే తొలిసారిగా 3డి ప్రింటింగ్ టెక్నాలజీతో పేదల ఇళ్ల నిర్మాణం

వచ్చే మార్చి నాటికి పోలవరం పూర్తి చేసి ప్రధానితో ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడి 2లో

అమరావతిని క్వాంటం వ్యాలీగా, మెగా సిటీగా అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ




# వ్యతిరేక పవనాలు

2లో

రంగంలోకి దిగిన పార్టీ పరిశీలకుడు - గ్రూపు రాజకీయాలతో పార్టీ మనగడ ప్రశ్నార్థకం

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 4:** బండి ఆత్మకూరు మండలంలో కొన్ని గ్రామాలలో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయా? అన్నది ప్రస్తుతం గ్రామాలలో చర్చలకు దారి తీస్తూ ఉంది. మరికొద్ది రోజులలో స్థానిక సంస్థలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం పరిస్థితులు ఎలాంటి పరిస్థితులకు దారితీస్తాయోనని పరిశీలకులు అంచనాలు వేసుకుంటున్నారు. మండలంలోని బండి ఆత్మకూరు సంత జుటూరు రామాపురం సింగవరం, బి.కోడూరు, కడమల కాల్వ , ఎర్రగుంట్ల రామాపురం పార్నపల్లె, గ్రామాలలో తెలుగుదేశం పార్టీకి అనుకూలమైన పరిస్థితులు లేవన్నది బహిరంగ రహస్యం. ఈ పరిస్థితులన్నీ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ టీం ద్వారా నిర్వహించిన సర్వేలో వెల్లడి అయినట్లుగా వెలుగులోకి వచ్చింది. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు భాస్కర్ శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశం ఇందుకు సాక్షి భూతంగా నిలుస్తూ ఉంది. అయితే పార్టీ పరిశీలకుడు పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లుగా కొందరికి మాత్రమే సమాచారం అందింది. మిగతా వారికి ఈ విషయంపై సమాచారం అందజేయకపోవడంతో మండలంలో గ్రూపు రాజకీయాలు



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు



కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్

రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న 2లో

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు.

## జంతర్ మంతర్‌లో లైంగిక వేధింపులు..

ఢిల్లీ పోలీసులపై ముగ్గురు మహిళా జర్నలిస్టుల సంచలన ఆరోపణలు!



జంతర్ మంతర్‌లో ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసుల లైంగిక వేధింపులు

ఓ ఏసీపీ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఓ జర్నలిస్ట్ ఆరోపణ

ఫిర్యాదులను విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసిన పోలీసులు 2లో

ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్

## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే.. చారిత్రక దినమన్న కాంగ్రెస్



తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ ప్రతిపక్షాల ఇండియా కూటమిలో చేరింది. ఈ విషయాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు బి.మాణికం టాగోర్ శనివారం అధికారికంగా ప్రకటించారు.

బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడిందన్న మాణికం టాగోర్ 2లో

ఎన్నికల కమిషన్ చీఫ్‌కు వ్యతిరేకంగా నిరసనలకు కూటమి నిర్ణయం

అక్టోబర్ 13 నుంచి 15 వరకు ఆందోళనలకు పిలుపు

# రిజర్వేషన్లు వద్దంటే పాకీ పని చేయండి..

ఆయన వ్యాఖ్యలపై బీజేపీ, పటేల్, బ్రాహ్మణ సంఘాల తీవ్ర ఆగ్రహం

వాఘేలాకే రూ.5 లక్షలు

ఇస్తామంటూ బీజేపీ నేత ప్రతి సవాల్

త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఊహాగానాలు 2లో



## ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం ప్రారంభం

2లో



# 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు..

ఆదివారం శంకుస్థాపన చేశారు.

**దేశానికే ఆదర్శం 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ** ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు టెక్నాలజీ గురించి వివరించారు. ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

**9 లక్షల ఇళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్** అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

**షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌కే కాదు.. ఆయన ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ

రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా ఎన్డీయే ప్రభుత్వం చారిత్రక ముందడుగు వేసింది. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ (పీఎంఏవై-జీ)' కింద మూడు లక్షల ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడిన చంద్రబాబు, 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదవాడికి సొంత ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదని, అదొక భద్రత, భవిష్యత్తుకు భరోసా అని ఆయన అభివర్ణించారు.

**కేంద్రం అండ.. 9 లక్షల ఇళ్ల లక్ష్యం** కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ కే కాదు "ఆంధ్రప్రదేశ్‌కు కూడా మామ" అని ఆప్యాయంగా సంబోధించిన చంద్రబాబు, ఆయన సహకారంతో రాష్ట్రానికి భారీగా గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే 3 లక్షల ఇళ్లను మంజూరు చేశారని, మరో మూడు, నాలుగు నెలల్లో ఇంకో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో 3 లక్షల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారని, మొత్తం 9 లక్షల ఇళ్లను రాష్ట్రానికి అందించనున్నారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో నదుల అనుసంధానం వంటి గొప్ప పనులతో శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 4 కోట్లకు పైగా పక్కా ఇళ్లను నిర్మించిందని గుర్తుచేశారు.

**దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ** ఈ కార్యక్రమంలో భాగంగా, దేశంలోనే తొలిసారిగా పేదల గృహ నిర్మాణంలో "3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ"ని వినియోగిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రయోగాత్మకంగా బుర్రిపాలెంలో 170 ఇళ్లను ఈ నూతన సాంకేతికతతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టెక్నాలజీతో నిర్మించిన ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల 8 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, తద్వారా ఏసీ అవసరం లేకుండానే చల్లదనం లభిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పినట్లు వివరించారు. కేవలం మూడు నెలల్లోనే ఇంటి నిర్మాణం పూర్తికావడం, వర్షాలకు తేమ చేరకపోవడం, లీకేజీలు ఉండకపోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా మరో 5,000 ఇళ్లు ఇదే విధానంలో నిర్మించి, బుర్రిపాలెం ఆదర్శాన్ని జాతీయ విధానంగా మార్చేందుకు కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని చంద్రబాబు ఆరోపించారు. పేదల కోసం గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన 17 లక్షల ఇళ్లలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, గృహ నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. చెరువులు, కొండలు, గుట్టల్లో నివాసయోగ్యం కాని స్థలాలను కేటాయించడంతో 4 లక్షల మంది లబ్ధిదారులు వాటిని తిరస్కరించారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, పట్టాదారు పాసుపుస్తకాలపై గత ముఖ్యమంత్రి ఫొటోను తొలగించి రాజముద్రతో కొత్త పట్టాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీసర్వే పూర్తి చేసి, భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమమే అజెండా** కూటమి ప్రభుత్వానికి 2024 ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా రాత్రింబవళ్లు పనిచేస్తామని చంద్రబాబు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం వంటివి ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి, ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాను ఆదుకున్నామని, ఈ ఏడాది కూడా 60 టీఎంసీల గోదావరి జలాలను తరలించామని వివరించారు.

**అమరావతి.. భవిష్యత్ మెగా సిటీ** అమరావతి కేవలం రాజధాని కాదని, అదొక మెగా సిటీగా రూపుదిద్దుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాలు కలిసిపోయి అంతర్జాతీయ స్థాయి నగరం ఆవిర్భవిస్తుందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3న అమరావతిలో "క్వాంటం వ్యాలీ"కి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలలో టిడిపికి వ్యతిరేక పవనాలు

నడుస్తున్నాయి అనే విషయానికి సాక్ష్యంగా నిలుస్తూ ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో శ్రీశైలం నియోజకవర్గం అభ్యర్థి బుడ్డ రాజశేఖర్ రెడ్డి విజయం కొరకు కార్యకర్తలందరూ కృషి చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కార్యకర్తలందరికీ న్యాయం చేయాలని ఉద్దేశంతో, ప్రతి గ్రామంలోనూ రోడ్ల అభివృద్ధికి, డ్రైనేజీ నిర్మాణాలకు గాను కోట్లాది రూపాయలను కేటాయించడం జరిగింది. ఈ నిధులను కేటాయించడంలో చిన్న స్థాయి కార్యకర్తలకు అన్యాయం జరిగిందన్న ఉద్దేశంతో చాలామంది కార్యకర్తలు మౌనంగా ఉంటూ వస్తున్నారు. ఎన్నికల తర్వాత పార్టీ అధ్యక్ష పదవి విషయంలో ఏకపక్ష నిర్ణయం జరిగిందన్న విషయం కూడా అప్పట్లోనే చర్చకు దారి తీసింది. ఇలాంటి పరిస్థితులలోనే గ్రామాలలో వర్గాలు ఏర్పడేందుకు పునాదులు ఏర్పడ్డాయి. తర్వాత చాలామందికి ఎమ్మెల్యే నామినేటెడ్ పదవులు కట్టపెట్టడం జరిగింది. నామినేటెడ్ పదవులు పొందిన వారంతా గ్రామాలలో పెత్తనాలు చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని ఎమ్మెల్యే బుడ్డా అప్పట్లోనే చాలాసార్లు హితోపదేశం చేశారు. చాలామంది నాయకులు ఈ విషయాన్ని పక్కనపెట్టి, తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే పనులు చేసుకుంటూ వచ్చారు. గ్రామాలలోని కొన్ని చెరువులలో మట్టిని త్రవ్వుకొని అమ్ముకునే విషయంలో కూడా రాజకీయ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. మట్టిని అమ్ముకునే విషయంలో అధికారులకు సైతం డబ్బులు ఇవ్వాలన్న ఉద్దేశంతో కొందరు నాయకులు అధికారుల పేరు చెప్పి డబ్బులు వసూలు చేసిన సంఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి . ఈ విషయం కొందరు అధికారుల దృష్టికి వెళ్లడంతో ఈ సంఘటనపై వారు సైతం నాయకుల పై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు కూడా జరిగాయి. గత ఏడాది ఖరీఫ్ రబీ సీజన్లలో యూరియా పంపిణీ విషయం కూడా చర్చకు దారి తీసింది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న వారికి అధికార యంత్రాంగం వత్తాసు పలకడం సబబే అయినప్పటికీ, కూటమి ప్రభుత్వంలో కొందరు నాయకుల పరిస్థితి ఇందులో శృతి మించిపోయింది. తాను చెప్పినవారికి ఎరువుల మందులు ఎత్తి తీరాల్సిందేనట్టు హుకూంలు జారీ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. చాలామంది నాయకులు అధిక సంఖ్యలో ఎరువుల మందులను తీసుకెళ్లి బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నారన్న విమర్శలు కూడా వినిపించాయి. ఈ విషయంలో నాయకుల ఒత్తిడిలకు తాళలేక గ్రామ వ్యవసాయ సహాయకులు ముకుమ్మడిగా సెలవులోకి వెళ్లిపోవాలని నిర్ణయించుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. యూరియా పంపిణీ విషయంలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ తమకు సైతం మందులు సక్రమంగా అందలేదని ఆ పార్టీ నాయకులే అసంతృప్తి వెళ్ళగక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. చెరువులలో మట్టి తోలుకునే విషయంలో సొంత గ్రామస్తుల పొలాలకు మట్టి ఇవ్వకుండా ఇతర గ్రామ నాయకులకు మట్టిని అమ్ముకున్నారన్న విషయం కూడా అప్పట్లోనే భగ్గుమంది. ఈ విషయం క్రింది స్థాయి కార్యకర్తలకు మింగుడు పడని విషయంగా మారింది. పార్టీ కోసం తాము అహర్నిశలు పనిచేస్తున్నప్పటికీ, తమకు ఎలాంటి గుర్తింపు లేదని గ్రామాలలో బూతు కన్వీనర్లు వెళ్లగకుతున్నారు. తమను కాదని పార్టీ అభివృద్ధి కొరకు ఏమాత్రం పనిచేయని నాయకులకు లక్షల పనులను కేటాయిస్తున్న విషయం కార్యకర్తలకు మింగుడు పడని విషయంగా మారింది. దీంతో పార్టీ పట్ల కార్యకర్తలలో అసంతృప్తి జ్వాలలు రగులుకుంటూ వస్తున్నాయి. గ్రామాలలో ఏర్పడిన వర్గ విభేదాలు ఘటనలు పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లడంతో, ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఆదేశాలతో పార్టీ పరిశీలకులు భాస్కర్ బండి ఆత్మకూరుకు వచ్చి నాయకులతో కార్యకర్తలతో రాజకీయ మంతనాలు జరిపారు. గ్రామాలలో పార్టీ నాయకులలో ఐకమత్యం లోపించిందని, ఈ కారణంగానే పార్టీలో వర్గాలు ఏర్పడుతున్నాయని ఒకరిద్దరు నాయకులు పార్టీ పరిశీలకుడు ముందే బహిర్గతం చేయడం చర్చకు దారి తీస్తూ ఉంది. అయితే పార్టీలో ఏర్పడ్డ బేధా భిప్రాయాలను పక్కన పెట్టి అందరూ పార్టీ అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని పరిశీలకుడు పేర్కొన్నట్లుగా తెలుస్తోంది.

**పార్టీ పరిశీలకుడిపై అసంతృప్తి** శ్రీశైలం నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు భాస్కర్ పై కూడా అసంతృప్తి జ్వాలలు చెలరేగుతున్నాయి. గ్రామాలలో పార్టీ పరిశీలకుడు వచ్చిన నేపథ్యంలో పార్టీలో ఒక వర్గానికి చెందిన వారే వచ్చిన పరిశీలకుడిని, సన్మానాలతో సత్కారాలు చేసి ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ పరిశీలకుడు అంటే గ్రామాలలోని అన్ని నాయకులను కార్యకర్తలను కలుపుకొని పోవాలని, శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఒక వర్గం వారినే పార్టీ కార్యాలయానికి పిలిపించి సమావేశాన్ని నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు టిడిపి నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరో వర్గం వారిని సమావేశానికి ఎలాంటి పిలుపు లేకుండానే సమావేశాన్ని నిర్వహించారని ఆ వర్గం భగ్గుమంటూ ఉంది. పార్టీ పరిశీలకుడు ఇప్పటికే రెండు మూడు సార్లుగా మండలానికి వచ్చినప్పటికీ కొందరు నాయకులను కలిసి వెళుతూ ఉండటం విమర్శలకు దారితీస్తూ ఉంది. పార్టీ పరిశీలకుడు అంటే అందరిని కలుపుకొని పోయే మనస్తత్వం ఉండాలని, సన్మానాలు తో సంతృప్తి పడి పోతే పార్టీ పరిస్థితి ఏమిటి అని పార్టీ నాయకులు కొందరు బహిరంగంగానే విమర్శిస్తూ ఉండటం కొసమెరుపు.

## ఏపీలో గృహ నిర్మాణ రంగంలో నూతన శకం ప్రారంభం:

ఆంధ్రప్రదేశ్‌లో గృహ నిర్మాణ రంగంలో ఒక నూతన వినూత్న శకం ప్రారంభమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (ఉూా ణవజూబ్ఎ జవీ ్రాఖుఖుఅ ఖుశ్రీఖుఅ) వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో పీఎంఏవై-జీ 2.0 కింద 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో ఏపీలో 'అందరికీ ఇళ్లు' లక్ష్యం దిశగా ఒక కీలక అడుగు పడిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. గ్రామీణ గృహ నిర్మాణంలో దేశంలో తొలిసారిగా '3డీ కాంక్రీట్ ప్రింటింగ్' పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం ఈ బృహత్తర కార్యక్రమానికి ఉన్న ప్రత్యేకత అని వివరించారు. బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో మొత్తం 177 ఇళ్లను ఈ సాంకేతికతతో నిర్మిస్తారని పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఒక్కో ఇంటిని కేవలం 10 రోజుల్లోనే పూర్తి చేయొచ్చని వివరించారు. అంతేకాకుండా, నిర్మాణ వ్యర్థాలను తగ్గిస్తూ, నాణ్యత, సమర్థతను ఇది మరింత పెంచుతుందని చెప్పుకొచ్చారు. ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని వివరించారు. మోదీ దార్శనిక నాయకత్వానికి, నిరంతర నిబద్ధత ఇదని.. ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు నిరంతరం మద్దతు ఇస్తూ, గ్రామీణ గృహ నిర్మాణంలో నూతన వినూత్న విధానాలను ప్రోత్సహిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

## మెల్లవాయిలో 300 మందికి ఉచిత వైద్య సేవలు

దివ్య చక్ర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సిహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో, శ్రీహిత హాస్పిటల్ చైతన్యపురి హైదరాబాద్ సౌజన్యంతో నాంపల్లి మండలం మెల్లవాయి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ శివప్రసాద్ ఈఎన్టీ మరియు జనరల్ సర్జన్, డాక్టర్ శ్రీకాంత్ ఎండి వైద్యులు విచ్చేసి రోగులను పరీక్షించి ఆరోగ్య సమస్యలపై సూచనలు, సలహాలు అందించారు. పేద,సామాన్య ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇంతకుముందు 60, 70 ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ ఎండి, చార్టర్ ఎకౌంట్ కొండల్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్, దేవేందర్ శిబిరాన్ని విజయవంతం చేయడంలో నిర్వాహకులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు, అధిక సంఖ్యలో పాల్గొని సహకరించారు.

# ఏపీలో 'తల్లికి వందనం'..

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం రెండో విడత నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి తుది అనుమతి రావడమే మిగిలి ఉంది. సీఎంవో నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే నిధులను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విడతలో భాగంగా అర్హులైన సుమారు 3.29 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 13,000 చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు, గతంలో సాంకేతిక కారణాలు, ఇతర మార్పుల వల్ల డబ్బులు అందని వారికి కూడా ఈ విడతలో నిధులు అందించనున్నారు. అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి తుది జాబితాను సిద్ధం చేశారు. నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌కు ఆర్థిక శాఖ కూడా ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఈ ఫైల్ సీఎంవో వద్ద తుది ఆమోదం కోసం ఉంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అనుమతి లభించిన వెంటనే, ఒకటి రెండు వారాల్లో లేదా వచ్చే వారంలోనే నిధులు జమ అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయ్యిందా లేదా, ఈ-కేవైసీ పూర్తయిందా అనే వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థి, తల్లి ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటివి సరిగ్గా ఉంటే నిధులు ఎలాంటి ఆటంకాలు లేకుండా సకాలంలో జమ అవుతాయని వారు స్పష్టం చేశారు.

## జంతర్ మంతర్‌లో లైంగిక వేధింపులు.. ఢిల్లీ పోలీసులపై ముగ్గురు మహిళా జర్నలిస్టుల సంచలన ఆరోపణలు!

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసన కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న ముగ్గురు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను నిష్పక్షపాత విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల సందర్భంగా ఈ ఘటన జరిగింది. బాధితురాళ్లలో ఒకరైన మహిళా జర్నలిస్ట్, ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) తనతో అనుచితంగా ప్రవర్తించారని, లైంగికంగా వేధించారని ఆరోపించారు. తాను పోలీసుల చర్యలను వీడియో తీస్తుండగా, ఆ అధికారి తనను అసభ్యంగా తాకి పక్కకు నెట్టేశారని ఆమె వాపోయారు. ఘటన అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, వెంటనే కేసు నమోదు చేయడానికి నిరాకరించారని వారు ఆరోపించారు. ఈ ఘటనపై 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (పీసీఐ) తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేసింది. "ప్రజాస్వామ్యంలో ఇలాంటి ప్రవర్తనను సాధారణ విషయంగా పరిగణించలేం. జర్నలిస్టులు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ విధులను నిర్వర్తించేలా చూడాలి. దేశ రాజధాని నడిబొడ్డున ఇలాంటి ఘటనలు జరగడం మీడియా స్వేచ్ఛకు మంచిది కాదు" అని పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. మహిళా జర్నలిస్ట్ ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, మీడియా ప్రతినిధులు బెదిరింపులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని డిమాండ్ చేసింది.

**రాహుల్ గాంధీ ఘాటు స్పందన** ఈ వ్యవహారంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోకి వస్తారని, కాబట్టి దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షానే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఒక మహిళా జర్నలిస్ట్ పోలీస్ అధికారిపై ఆరోపణలు చేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే డిమాండ్‌తో వందలాది మంది జర్నలిస్టులు గంటల తరబడి అక్కడే కూర్చున్నారు. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణం" అని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. "ఒక మహిళ ఫిర్యాదును నమోదు చేయడానికి కూడా భయపడే ప్రభుత్వం దేనిని కాపాడుతోంది? అమిత్ షా గారూ, మీరెక్కడున్నారు? దీనికి మీరే సమాధానం చెప్పాలి" అని రాహుల్ సూటిగా ప్రశ్నించారు.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు:

ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## ఇండియా కూటమిలోకి విజయ్ టీవీకే.. చారిత్రక దినమన్న కాంగ్రెస్

చెన్నైలోని టీఎన్‌సీసీ కార్యాలయంలో జరిగిన బహుళ పార్టీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి టీవీకే తరఫున మంత్రులు ఆధవ్ అర్జున, ఎన్.మేరీ విల్సన్ హాజరయ్యారు. టీవీకే చేరికను 'చారిత్రక దినం'గా అభివర్ణించిన మాణికం టాగోర్, ఈ పరిణామంతో తమిళనాడులో బీజేపీ వ్యతిరేక కూటమి మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ భేటీలో కాంగ్రెస్, టీవీకేతో పాటు సీపీఎం, సీపీఐ, వీసీకే, ఎండీఎంకే, ఐయూఎంఎల్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల కమిషన్ చీఫ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి ప్రదర్శనలు, అక్టోబర్ 15న చెన్నైలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఇండియా కూటమిలో తమ పార్టీ అధికారికంగా చేరినట్లు టీవీకే మంత్రి ఆధవ్ అర్జున సైతం ధ్రువీకరించారు. అయితే, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నుంచి నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## రిజర్వేషన్లు వద్దంటే పాకీ పని చేయండి.

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నేత శంకర్‌సింహ్ వాఘేలా చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. రిజర్వేషన్లను వ్యతిరేకించే అగ్రవర్ణాల వారు మ్యానువల్ స్కావెంజింగ్ (పారిశుద్ధ్య పనులు) చేస్తే నెలకు రూ.50,000 ఇస్తానని ఆయన చేసిన సవాల్ వివాదాస్పదంగా మారింది. నర్మదా జిల్లాలోని సాగ్‌బారాలో అక్టోబర్ 2న జరిగిన ఆదివాసీ రైతుల సమావేశంలో వాఘేలా మాట్లాడారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ.. అది ఎవరూ ఇస్తున్న భిక్ష కాదని, దశాబ్దాలుగా అనుభవించిన వివక్షకు బదులుగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే పటేల్, బనియా, బ్రాహ్మణ సామాజిక వర్గాలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. వాఘేలా వ్యాఖ్యలపై బీజేపీ, పాటీదార్, బ్రాహ్మణ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బీజేపీ నేత, బ్రహ్మ సమాజ్ నాయకుడు యజ్ఞేశ్ దవే తీవ్రంగా స్పందిస్తూ.. వాఘేలానే తన ఇంట్లో ఆ పని చేస్తే నెలకు రూ.5 లక్షలు ఇస్తానని ప్రతి సవాలు విసిరారు. పాటిదార్ నాయకుడు అల్పేష్ కథీరియా కూడా వాఘేలా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆసక్తికరంగా, ఈ కార్యక్రమానికి గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమిత్ చావ్డాతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు కూడా హాజరయ్యారు.

**కాంగ్రెస్‌లో చేరికపై చర్చలు** ఇదే సమయంలో శంకర్‌సింహ్ వాఘేలా తిరిగి కాంగ్రెస్ గూటికి చేరబోతున్నారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. 2017లో పార్టీని వీడిన ఆయన, బీజేపీని ఓడించేందుకు తిరిగి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమని ఇటీవల ప్రకటించారు. దీనికి సంబంధించిన చర్చలు చివరి దశలో ఉన్నాయని సమాచారం. త్వరలో జరగనున్న గాంధీనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ తరఫున ప్రచారం కూడా చేయనున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతుండగా, కాంగ్రెస్‌లో ఆయన చేరికపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నాగరాజు గౌడ్ ఎన్నిక



### 30 ఏళ్ల వినియోగదారుల హక్కుల పరిరక్షణ సేవలకు గుర్తింపు
### ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంలో విశేష కృషి

**డోన్ : నంది పత్రిక అక్టోబర్ 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎన్నిక అయిన ఏఈ నాగరాజు గౌడ్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు యాదవ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలను గత 30 సంవత్సరాలుగా నాగరాజు గౌడ్ స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వినియోగదారుల హక్కులు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పిస్తూ, సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం నాగరాజు చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు ఆయన పేరును రాష్ట్ర గవర్నర్‌కు సిఫారసు చేయడం అభినందనీయమన్నారు. నాగరాజు సేవలను గుర్తించి విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నామినేట్ చేసిన రాష్ట్ర గవర్నర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యత ద్వారా వినియోగదారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వారికి మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం లభించిందని అన్నారు. ఈ సందర్భంగా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణపై తాను నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన సేవలను గుర్తించి కమిషనర్ కన్నబాబుకు తన పేరును సూచించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర గవర్నర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వినియోగదారుల హక్కుల



పరిరక్షణ కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, వినియోగదారుల సంఘం నాయకులు కాల్వ ఓం నారాయణ, గోసంపల్లి తెలుగు రాంబాబు, అల శ్రీరాములు, వనం లక్ష్మీదేవి, ఏసుపాదం, చిన్న మల్కాపురం, గార్లపాటి నాగన్న, గోసంన్ పల్లి నాగన్న తదితరులు పాల్గొని నాగరాజు గౌడ్‌ను అభినందించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యే కోట్ల దంపతులకు ఆహ్వానం



**డోన్ : నంది పత్రిక అక్టోబర్ 4** పట్టణంలోని అమ్మవారిశాలలో నిర్వహించనున్న దసరా నవరాత్రుల మహోత్సవాలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలను కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిశాలలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు, భక్తి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు డోన్ పట్టణ ప్రజలకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యత కలిగినవని, ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లపై కూడా దృష్టి సారిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరికిషన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పాల్గొని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

# బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది





### బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అన్ని విధాలా సహకారం : ఎమ్మెల్యే కోట్ల

**డోన్, అక్టోబర్ 4 నంది పత్రిక** బీసీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. బీసీల ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. డోన్ పట్టణంలోని న్యూ మధు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ప్రతినిధులు ఎమ్మెల్యే కోట్లకు ఘన స్వాగతం పలికారు సమావేశంలో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో బీసీల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతిలో బీసీలు కీలక భూమిక పోషిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వెనుకబడిన వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. బీసీ సంఘాల నాయకులు తమ ప్రాంతాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీల హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం బీసీ సంఘాలు ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోట్ల సూచించారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు సమన్వయంతో పనిచేసినప్పుడే బీసీ వర్గాల అభ్యున్నతికి మరింత మెరుగైన ఫలితాలు సాధించగలమన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే కోట్లను సత్కరించి అభినందించారు. బీసీలకు సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు, వలస రామకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, జిల్లా నాయకులు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, బీసీ సామాజిక వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## తైక్వాండో బెల్ట్ టెస్ట్ నిర్వహణ కార్యక్రమం.



**బేతంచెర్ల అక్టోబర్ 04 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల పట్టణం లోని శేషా రెడ్డి హై స్కూల్‌లో తైక్వాండో బెల్ట్ టెస్ట్ మిర్వహణ కార్యక్రమంఆదివారం నాడు విజయ వంతంగా నిర్వహించబడింది. ఈ పరీక్షలో విద్యార్థులు తమ తైక్వాండో నైపుణ్యాలను ప్రదర్శించారు. బెల్ట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ బెల్ట్ టెస్ట్‌ను మాస్టర్ బి. వెంకటేశ్వర్లు, 4వ డాన్ బ్లాక్ బెల్ట్, నేషనల్ రిఫరీ, కర్నూలు జిల్లా కార్యదర్శి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి కోచ్ ఎన్. నాగన్న విద్యార్థులకు శిక్షణ అందించి, వారి ప్రతిభను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషించారు. విద్యార్థులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని, మంచి ప్రతిభ కనబరచాలని మాస్టర్, కోచ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో మాస్టార్ బి.వెంకటేశ్వర్లు3వ డాన్ బ్లాక్ బెల్ట్, నేషనల్ రిఫరీ, కర్నూలు జిల్లా కార్యదర్శి కోచ్ ఎన్.నాగన్న 1వ డాన్ బ్లాక్ బెల్ట్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ పరిష్కారంపై ప్రజల అభిప్రాయమే ప్రామాణికం

### క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ నమోదు తప్పనిసరి
### అసంతృప్తి వ్యక్తమైన అర్జీలపై ప్రత్యేక పునఃపరిశీలన
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, అక్టోబరు 04(నంది పత్రిక):–** ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తూ, అధికారులు అందించిన పరిష్కారాలపై అర్జీదారుల వాస్తవ అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా సమర్పించిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యల పట్ల అర్జీదారులు ఎంతవరకు సంతృప్తిగా ఉన్నారో నేరుగా తెలుసుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. ఫీడ్‌బ్యాక్ నమోదు ఇలా చేయాలి: అర్జీ పరిష్కారమైనట్లు సమాచారం అందిన అనంతరం, సంబంధిత రసీదు లేదా సందేశంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేసి, పరిష్కారంపై తమ సంతృప్తి లేదా అసంతృప్తిని అర్జీదారులు నమోదు చేయాలి. ప్రజల నుంచి అందే అభిప్రాయాల ఆధారంగా పరిష్కారాల నాణ్యతను అంచనా వేసేందుకు, అధికారుల పనితీరును మెరుగుపరిచేందుకు అవకాశం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. **అసంతృప్తి వ్యక్తమైన అర్జీలపై ప్రత్యేక దృష్టి:** అధికారులు అందించిన పరిష్కారంపై అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేసిన పక్షంలో, సంబంధిత అర్జీలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమీక్షిస్తారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో సమస్యను పునఃపరిశీలించి, అర్జీదారులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారు. అధికారుల జవాబుదారీతనానికి ప్రాధాన్యం: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం వంటి అంశాలను గుర్తించడంతో పాటు, ప్రభుత్వ సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరిచేందుకు ప్రజల ఫీడ్‌బ్యాక్ కీలకంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అర్జీదారులందరూ తమ సమస్య పరిష్కారమైన అనంతరం క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా వాస్తవ అభిప్రాయాన్ని నమోదు చేసి, ప్రజలకు జవాబుదారీగా ఉండే పారదర్శక పాలనను బలోపేతం చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కోరారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే లక్ష్యం
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 04(నంది పత్రిక):–** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని, అర్జీల పరిష్కార స్థితిని టోల్‌ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయిలో సమస్యలను పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ లో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించాలని ఆదేశించారు.

# సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్

### క్యూఆర్ కోడ్ ద్వారా పీజీఆర్ఎస్‌పై అభిప్రాయాన్ని నమోదు చేసుకోవచ్చు
### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపే ఉద్దేశంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో,రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.

క్యూఆర్ కోడ్ ద్వారా సమస్యల పరిష్కారంపై ఫీడ్ బ్యాక్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తమకు అందిన సేవలు, సమస్యల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్‌ను క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన అనంతరం తెరుచుకునే పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ పేజీలో అవసరమైన వివరాలను నమోదు చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా పీజీఆర్ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందనను క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని జిల్లా కలెక్టర్ కోరారు.




## తాండవ మల్లేశ్వర స్వామి ఆలయ పరిశీలన



**కొత్తపల్లి – నంది పత్రిక :** మండల కేంద్రంలో వెలసిన పురాతన ఆలయమైన శ్రీ పార్వతి సమేత తాండవం మల్లేశ్వర స్వామి ఆలయాన్ని కర్నూలు దేవాదాయ శాఖ సహాయ స్థపతి సుబ్రహ్మణ్యం ఆదివారం పరిశీలించారు. ముందుగా ఆయన కు అర్చకుడు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. తాండవ మల్లేశ్వర స్వామికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణం జరిగి వందల సంవత్సరాలు అయినది. ఆలయం శిధిలావస్థకు చేరుతుందన్న గ్రామస్తుల కోరిక మేరకు ఆలయాన్ని పరిశీలించామన్నారు. ఆలయమును పునర్ నిర్మించేందుకు ఎస్టిమేషన్ వేశామన్నారు. గర్భాలయం ఎంత మేరకు నిర్మించాలి, పూర్తి ఆలయ నిర్మాణం ఎంత మేరకు చేపట్టాలి అని కొలతలు వేసి గ్రామస్తులకు తెలియజేశామన్నారు. పూర్తి ఆలయ నిర్మాణానికి ఎంత మేరకు ఖర్చు అవుతుంది అన్న విషయాలను దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. దేవాదాయ శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఆల య పునర్ని ర్మా ణాన్ని చేపడ తామని అన్నా రు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



## పులివీడు పంచాయతీలో నాలుగు విద్యా కమిటీ చైర్మన్ పదవులు వైఎస్సార్‌సీపీ కైవసం

**పోరుమామిళ్ల, అక్టోబర్ 4( నంది పత్రిక ):** పోరుమామిళ్ల మండలం పులివీడు గ్రామపంచాయతీలోని నాలుగు పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ పదవులను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నారు. పులివీడు ఎలిమెంటరీ ఎంపీ స్కూల్ చైర్మన్‌గా గొడుగు బాబు, ఉర్దూ స్కూల్ చైర్మన్‌గా షేక్ బాబు, పేరమ్మగారిపల్లి విద్యా కమిటీ చైర్మన్‌గా మురస వెంకటరమణ, బొప్పాపురం విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా శ్రీమతి జి. మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన విద్యా కమిటీ చైర్మన్లను మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, మస్తాన్, కదుగుబాబు, పోతుగంటి బాలయ్య, బడేసాబ్, అశోక్ రెడ్డి, రంగారెడ్డి, నబీసాబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆధునికీకరించారని, దీంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం మళ్లీ ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళు



న్నారని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని, కొన్ని పాఠశాలలు మూతపడగా మరికొన్ని పాఠశాలలు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మెరుగుపడుతుందని నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

# ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలం..!

**ప్రొద్దుటూరు నుంచి జల విప్లవానికి శ్రీకారం**

**రూ.30,156 కోట్లతో 'జల జీవన్ మిషన్ - అమరజీవి జలధార'కు రాష్ట్ర స్థాయి ప్రారంభోత్సవం**

**27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లతో.. 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు చేకూరనున్న ప్రయోజనం**

**రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా సోమవారం లాంఛనిక ప్రారంభం**

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** : గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేస్తోంది. కోట్లాది మంది గ్రామీణ ప్రజల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన 'జల జీవన్ మిషన్ – అమరజీవి జలధార' కార్యక్రమానికి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు వేదికగా సోమవారం రాష్ట్ర స్థాయిలో శ్రీకారం చుట్టనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించి పనులకు శంఖుస్థాపన చేయనున్నారు.

**ఇది కేవలం తాగునీటి పథకం మాత్రమే కాదు..** గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే భారీ మౌలిక వసతుల నిర్మాణ కార్యక్రమం. రూ.30,156.12 కోట్ల అంచనా వ్యయంతో 50,315 పనులు చేపట్టడం ద్వారా రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు సైతం శాశ్వత నీటి వసతులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం.

**ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ సురక్షిత నీరు..** 'హర్ ఘర్ జల్' లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్‌ను 2028 డిసెంబర్ వరకు పొడిగించింది. ప్రతి గ్రామీణ కుటుంబానికి వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ద్వారా తలసరి రోజుకు 55 లీటర్ల సురక్షిత మంచినీరు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలో ఇప్పటికే 61.60 లక్షల కుటుంబాలకు, అంటే సుమారు 65 శాతం కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. మిగిలిన కుటుంబాలను కూడా వేగంగా కవరేజ్‌లోకి తీసుకురావడానికి ప్రభుత్వం భారీగా పనులు చేపడుతోంది. 'అమరజీవి జలధార'లో భాగంగా 24,601 ఆవాసాల్లోని 27.36 లక్షల కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. తద్వారా సుమారు 3.27 కోట్ల గ్రామీణ ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెట్టుబడి...** "జల జీవన్ మిషన్‌అమరజీవి జలధార" కింద చేపట్టే పనులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఎస్‌వీఎస్, పునరుద్ధరణ పనులకు రూ.9,068.94 కోట్లు, 32 ఎంవీఎస్ ప్రాజెక్టులకు రూ.19,462.39 కోట్లు, నీటి నాణ్యత పర్యవేక్షణ తదితర కార్యకలాపాలకు రూ.1,624.79 కోట్లు కలిపి మొత్తం రూ.30,156.12 కోట్ల పెట్టుబడితో 50,315 పనులు చేపట్టనున్నారు.ఇప్పటికే 27,301 పనులు పూర్తికాగా, రూ.5,587.01 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు సుస్థిరమైన నీటి సరఫరా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.

**ప్రధాన జలాశయాల నుంచి గ్రామాలకు నీరు...** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ ఎంవీఎస్ ప్రాజెక్టులను చేపడుతున్నారు. హిరమండలం, పీఏబీఆర్, వెలుగోడుఓంకారం, ధవళేశ్వరం, తాండవ, ఏలేరు, గండికోట వంటి ప్రధాన జలాశయాలు, నీటి వనరుల నుంచి నీటిని సేకరించి గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నారు.రూ.10,320 కోట్లతో చేపట్టే 12 కీలక ఎంవీఎస్ ప్రాజెక్టుల ద్వారా 7,126 ఆవాసాల్లోని 88.68 లక్షల జనాభాకు ప్రయోజనం కలగనుంది. మరోవైపు రూ.3,297 కోట్లతో 8,494 ఎస్‌వీఎస్ పనులు చేపట్టనున్నారు.

**వేల కిలోమీటర్ల పైపులైన్లు.. భారీ నీటి నిల్వ వ్యవస్థ...** అమరజీవి జలధార ద్వారా గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు భారీ మౌలిక వసతులు సమకూరనున్నాయి. ఇందులో భాగంగా 1,426 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు, 14,995 నీటి నిల్వ నిర్మాణాలు, 77,243 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించనున్నారు.ఇవి పూర్తయితే మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలు, నీటి కొరత ఎదుర్కొనే ప్రాంతాల్లోనూ ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే సామర్థ్యం రాష్ట్రానికి ఏర్పడుతుంది.

**నీటి భద్రతతో గ్రామీణ జీవనంలో కొత్త మార్పు...** సురక్షిత తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ కుటుంబాలకు సమయం, శ్రమ ఆదా కావడమే కాకుండా మహిళలు, పిల్లలపై నీటి సేకరణ భారం తగ్గనుంది. నీటి నాణ్యత పర్యవేక్షణ, స్థానిక సమాజ భాగస్వామ్యం, వనరుల సుస్థిర నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా భవిష్యత్ తరాలకు కూడా నీటి భద్రత కల్పించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

**ప్రొద్దుటూరు నుంచి రాష్ట్రానికి కొత్త భరోసా...** రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది గ్రామీణ ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ఈ భారీ కార్యక్రమానికి ప్రొద్దుటూరు వేదిక కావడం వైఎస్ఆర్ కడప జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయిలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ద్వారా 'ప్రతి ఇంటికీ నీరు.. ప్రతి కుటుంబానికి భరోసా' అనే ప్రభుత్వ లక్ష్యం మరింత వేగం అందుకోనుంది.ఈ బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, కూటమి ప్రభుత్వ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ప్రొద్దుటూరు ప్రాంతం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకోనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ కుటుంబాలకు సురక్షిత తాగునీటిని అందించే మహత్తర లక్ష్యానికి ప్రొద్దుటూరు వేదికగా శ్రీకారం చుట్టడం ప్రజల్లో కొత్త ఆశలు, అభివృద్ధిపై మరింత నమ్మకాన్ని నింపనుంది. ప్రతి ఇంటికీ కుళాయి.. ప్రతి కుటుంబానికీ స్వచ్ఛమైన నీరు అనే లక్ష్య సాధనలో 'జల జీవన్ మిషన్‌అమరజీవి జలధార' రాష్ట్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.



## భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకోండి.

### కమిషనర్ ఎం.జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక**నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక నిబంధనలు పాటించకుండా జరుగుతున్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. ఆదివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న భవన నిర్మాణ పనులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. నగరంలో జరుగుతున్న భవన నిర్మాణాలను అధికారులు సిబ్బందితో కలసి పరిశీలించాలని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు ఉన్నాయా? నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయా? అనే విషయాలను అధికారులు తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా ఏవైనా నిర్మాణాలు జరిగినట్లు తన దృష్టికి వస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట ఇంచార్జి డిసిపీ మూర్తి, టిఫివో వంశీ, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు, తదితరులు ఉన్నారు.



# దేవాలయాల భూముల కౌలు దారుల, సాగు రైతుల రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయండి.





**బేతంచెర్ల అక్టోబర్ 04 ( నంది పత్రిక ).** అక్టోబర్ 7 వతేది బుధవారం ఉదయం 10గంటలకు యం.బి భవన్ విజ్ఞాన కేంద్రం( విజయవాడ ) నందు జరుగు దేవాలయ భూముల కౌలు దారుల, సాగు రైతుల రాస్ర సదస్సు నిర్వహించడం జరుగునని ఎపి రైతు సంఘం బేతంచెర్ల మండల కమిటి ఆధ్వర్యంలో స్థానిక మండలం లోని గ్రామాలలో రాష్ట్ర సదస్సు కర పత్రాలను పంపిణీచేశారు.సీనియర్ రైతు నాయకులు నీలి వెంకట కృష్ణా రెడ్డి అధ్యక్షతన ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం జరిగింది.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బ రాయుడు, మండల కార్యదర్శి పి.రామ మోహన్ లు మాట్లాడుతూ,దేవాలయ భూముల కౌలు దారులు,సాగు రైతులు అనేక సమస్యలు ఎదు ర్కొంటున్నారు. వ్యవసాయం గిట్టు బాటు కావడం లేదు. కౌలు రేట్లు పెరిగాయి. ఎరువులు, పురుగు మందుల ధరలు, నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజల్, గ్యాస్ ధరలు,వడ్డీ రేట్లు,కిరాయిలు విపరీతంగా పెరిగి, రైతులకు,కౌలు రైతులకు భారమై పోతున్నాయి. ఎరువుల యాప్ ద్వారా యూరియా, డిఎపి సరి పడ నంత ఇవ్వక పోవడం వల్ల కౌలు రైతులకు ఇబ్బందిగా ఉన్నది. తుఫాన్లు, వరదలు ఈ సంవత్సరం ఎలినినో వల్ల, తీవ్రంగా నష్ట పోవుట జరుతుంది.ఈ సమస్యలపై చర్చించుకొని రాష్ట్ర ప్రభుత్వం,ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకు వచ్చేందుకు ఈ సదస్సు ఏర్పాటుకు ముఖ్య ఉద్దేశ్యం. ఈ సదస్సుకు దేవాదాయ శాఖ మంత్రి, రాష్ట్ర స్థాయి దేవాదాయ, ధర్మాదాయ శాఖ,పంటలకు రుణాలు ఇచ్చు బ్యాంకు అధికారులను ఆహ్వానించారు.

కనుక దేవాలయ భూముల, కౌలు దారుల, సాగు రైతులు అందరూఅక్టోబర్ 7 వతేది బుధవారం జరిగే రాష్ట్ర సదస్సులో పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ల కృష్ణ సురేష్, వెంకటేశ్వర్లు ఎల్. డి. రామాంజనేయులు రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సెలవు దినాల్లో అనధికారికంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలి-ఏబీవీపీ




**నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 04 . (నంది పత్రిక ):**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, నంద్యాల నగరంలో ఉన్నటువంటి పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సెలవు దినాల్లో అనధికాంగా తరగతి గదులను నిర్వహిస్తున్న యాజమాన్యాల దగ్గరికి వెళ్లి తరగతి గదులు జరగకుండా అడ్డుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లక్ష్మి నరసింహ మాట్లాడుతూ, నగరంలో ఉన్నటువంటి పాఠశాలలు, కళాశాలలో అనధికారికంగా, ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతి గదులను, స్పెషల్ క్లాస్ ల పేరుతో నిర్వహిస్తున్నారని, కలెక్టర్ ఆఫీస్, విద్యాశాఖ అధికారుల దగ్గరికి ఎన్నిసార్లు వెళ్లిన కనీసం చలనం కూడా లేదని చెప్పారు.ఆదివారం రోజున జరుగుతున్న తరగతి గదులను అడ్డుకొని, సాక్షాధారాలతో సహా తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యాలను అడ్డుకోవడం జరిగింది.ఇవే కాకుండా నంద్యాలలో ఉన్నటువంటి అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అనధికాంగా తరగతి గదులు నిర్వహిస్తున్నారు.ప్రభుత్వ సెలవు దినాల్లో ఎందుకు తరగతి గదులు నిర్వహిస్తున్నారు అని అడిగితే, మేము విద్యాశాఖ అధికారులతో మాట్లాడుకుంటాము, మీరెవరు మమ్మల్ని అడగడానికి అని చెబుతున్నారు.దీనికి విద్యాశాఖ స్పందించాలని ఏబీవీపీ నంద్యాల శాఖ డిమాండ్ చేస్తుంది.మీ సంగతి ఏంటో చూస్తాం, ఏంటి మీ పంచాయతీ అనే వలగరి మాటలతో పాఠశాల యంత్రాంగాలు వ్యవహరిస్తున్నాయి.ఇలాంటి పాఠశాల యాజమాన్యాలను గుర్తించి, నోటీసులు జారీ చేయాలని లేదా సీజ్ చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది.ఈ కార్యక్రమంలో నంద్యాల భాగ్ కన్వీనర్ మనేష్ నాయుడు, నగర జాయింట్ సెక్రటరీలు సాయి, చైతన్య,కన్వీనర్ కేదార్, విష్ణు, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.



# చెత్తకుప్పగా మారినా డివైడర్ పట్టించుకోని అధికారులు..!



**అంబేద్కర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు చెత్త పేరుకుపోవడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు**

**పోరుమామిళ్ల, అక్టోబర్ 4( నంది పత్రిక ):** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌లో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలోనే ఈ పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డివైడర్ చెత్తకుప్పగా మారుతున్నా పట్టింపు ఏది?** డివైడర్ లోపల ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు, తినుబండారాల వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం పేరుకుపోయి కనిపిస్తోంది. దీంతో ప్రధాన రహదారి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పట్టణంలో ప్రధాన రహదారి కావడంతో నిత్యం ప్రజలు, వాహనదారులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు.

**వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్న చెత్త**డివైడర్‌లో పేరుకుపోయిన తేలికపాటి చెత్త గాలి వీచినప్పుడు రోడ్డుపైకి ఎగిరివచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు ద్విచక్ర వాహనదారుల ముందుకు రావడం వల్ల క్షణికంగా దృష్టి మరలే ప్రమాదం ఉంది. రోడ్డుపై చెత్త పడితే ద్విచక్ర వాహనాల టైర్లకు చిక్కి వాహనాలు అదుపుతప్పే పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశం ఉంది.దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యల భయంచెత్తలో ఆహార వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన రావడంతో పాటు ఈగలు, దోమలు, ఇతర కీటకాలు చేరే అవకాశం ఉంది. దీంతో పరిసరాల్లో నివసించే ప్రజలు, షాపుల వద్దకు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోంది.

**పట్టణం మధ్యలోనే అపరిశుభ్రత..**

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు** పట్టణంలోని ప్రధాన రహదారిలోనే డివైడర్ చెత్తతో నిండిపోతుండటంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు, మరోవైపు ప్రధాన రహదారిలో చెత్త పేరుకుపోవడాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**షాపు యజమానులకు కౌన్సెలింగ్ అవసరం** రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల నుంచి వచ్చే వ్యర్థాలను డివైడర్‌లో వేయకుండా సంబంధిత అధికారులు షాపు యజమానులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయాలని వారికి అవగాహన కల్పించాలి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి** కేవలం కౌన్సెలింగ్‌తో సరిపెట్టకుండా పదేపదే డివైడర్‌లో చెత్త వేస్తున్న వారిపై అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడితేనే ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోకుండా నియంత్రించవచ్చని చెబుతున్నారు.

**వెంటనే చెత్త తొలగించాలి** అంబేద్కర్ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు డివైడర్‌లో పేరుకుపోయిన చెత్తను సంబంధిత అధికారులు వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. డివైడర్‌ను పూర్తిగా శుభ్రం చేసి, భవిష్యత్తులో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం.. వాహనదారుల భద్రతపై దృష్టి పెట్టాలి ప్రధాన రహదారుల పరిశుభ్రత కేవలం పట్టణ అందానికే సంబంధించిన విషయం కాదని, అది ప్రజల ఆరోగ్యం, వాహనదారుల భద్రతకు సంబంధించిన అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టి పోరుమామిళ్ల ప్రధాన రహదారిని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.



## నాగలకుంట్ల ఎస్ఎంసీ చైర్మన్‌గా పోతుగంటి గురయ్య ఏకగ్రీవ ఎన్నిక

**పోరుమామిళ్ల, అక్టోబర్ 4( నంది పత్రిక)** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం సంచర్ల పంచాయతీ పరిధిలోని నాగలకుంట్లలో ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఎస్ఎంసీ చైర్మన్‌గా పోతుగంటి గురయ్య, వైస్ చైర్మన్‌గా రాయపాటి మేఘన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 10 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు కారె.జె. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్లూరి విజయభాస్కర్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుకు టీడీపీ కట్టుబడి ఉంది

### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**నంది పత్రిక ఆత్మకూరు..** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాలనుఅడ్డుకునేందుకువైసీపీనేతలున్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇందుకు సంబంధించి జీవో నెం.105, 1065లను జారీ చేసిందని పేర్కొన్నారు. అయితే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయించి బీసీల రిజర్వేషన్లకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. న్యాయపరమైన అంశాలనపరిష్కరించుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు34శాతంరిజర్వేషన్లు అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని అన్నారు. అన్ని వర్గాల హక్కులను కాపాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు బీసీలకు పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. బీసీలకు అన్యాయం జరగకుండా, రాజకీయ ప్రాతినిధ్యం పెంచేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. గతంలో కూడా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ముందుందని బుడ్డా రాజశేఖరరెడ్డి గుర్తుచేశారు. 1987లో 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లను బీసీలకు కల్పించినఘనతతెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే టీడీపీ విధానమని ఆయన స్పష్టం చేశారు. "బీసీల రాజకీయ సాధికారతే టీడీపీ లక్ష్యం" బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి వారికి రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.



## ఖాసిం వల్లికి... ఆచార్యదేవోభవ పురస్కారం ప్రధానం



**కాశి నాయన, అక్టోబర్ 4 (నంది పత్రిక ):** కాశి నాయన మండలంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల, బాలాయ పల్లె నందు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాసిం వల్లికి ఆదివారం కలసపాడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో "వివేకానంద సేవా ట్రస్ట్, ఓబులాపురం " వారు "ఆచార్యదేవోభవ పురస్కారం "అందించారు. ఈ పురస్కారం స్వామి వివేకానంద సేవాశ్రమం ట్రస్ట్ వ్యవస్థాపకులు పాపి జెన్ని రామకృష్ణారెడ్డి,కలసపాడు ఎం.పీ.డీ.వో మహబూబ్ బీ,విశ్రాంత డిప్యూటీ డి.ఎం.హెచ్. ఓ డాక్టర్ మార్కా రెడ్డి చేతుల మీదుగా ప్రధానం జరిగింది. విద్య,సామాజిక రంగాలలో ఖాసిం వల్లి చేస్తున్న కృషిని గుర్తించి ఖాసిం వల్లి కి ఈ అవార్డు ప్రధానం చేయడం జరిగింది. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఖాసీం వల్లి అన్నారు. ఖాసీం వల్లికి పురస్కారం అందడంతో బాలాయపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లా దస్తగిరి బాబు, గ్రామస్తులు,మండల విద్యాధికారులు మహమ్మద్ షఫీ, నిర్మల,లైబ్రరియన్ పఠాన్ ఆఫ్రిది, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## అడవులను కాపాడుకుందాం వన్య ప్రాణులను సంరక్షిద్దాం.



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 04 (నంది పత్రిక):** అడవులను కాపాడుకుందాం వన్యప్రాణులను సంరక్షించుకుందాం అని రుద్రవరం రేంజి ఆఫీసర్ ముర్తుజావలిఅన్నారు. ఆదివారం రుద్రవరం మండలంలోని హరినగరం గ్రామంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఫారెస్ట్ అధికారి సి. చైతన్య కుమార్ రెడ్డి గారి ఆదేశాల మేరకు సబ్ డి ఎఫ్ ఓ శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో రుద్రవరం రేంజ్ నూతల సెక్షన్ పరిధిలోని హరి నగరం గ్రామంలో 72వ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు ఆవాసాల అనుసంధానం-వృద్ధి చెందుతున్నవన్యప్రాణులు అనే ఇతివృత్తంతో 72వ వన్యప్రాణి వారోత్సవాలు అక్టోబర్ 2 నుంచి 8 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ పెద్దలుసంజీవ రాయుడు వి ఎస్ ఎస్ చైర్‌పర్సన్ పి. సుబ్బరాయుడు సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించమన్నారు. హరి నగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వన్యప్రాణులపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా వన్యప్రాణి వారోత్సవాల ఉద్దేశ్యం, అడవులు మరియు వన్యప్రాణుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణ ఆవశ్యకత గురించి విద్యార్థులు మరియు గ్రామస్థులకు వివరించడం జరిగింది.అనంతరం గ్రామస్థులతో కలిసి వన్యప్రాణి పరిరక్షణపై మానవహారం నిర్వహించి, వన్యప్రాణులను సంరక్షించేందుకు గ్రామస్థులతో కలిసి వన్యప్రాణి పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.తదుపరి, అడవుల్లో వన్యప్రాణులను పట్టుకోవడానికి ఏర్పాటు చేసే ఉచ్చులు, వలలు మరియు ఇతర అక్రమ వేట పద్ధతుల వల్ల కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, అక్రమ వేటను నిరోధించడం మరియు వన్యప్రాణుల ఆవాసాలను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించాము. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు వి జేమ్స్ పాల్, పి మాబుఖాన్, టి రామకృష్ణ, జి శ్రీనివాసులు, బీటు ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నరసింహారెడ్డి, నాగ హుస్సేనయ్య, నగేష్, ఫాల్కన్ బేస్ క్యాంప్ పిడబ్ల్యూ ఎస్ గ్రామస్థులు పాల్గొన్నారు.

# బీజేపీ మండల విస్తృతస్థాయి సమావేశం

### గ్రామాల అభివృద్ధే భారతీయ జనతా పార్టీ లక్ష్యం కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ సూచనలతో కోడుమూరు మండల అధ్యక్షులు బోయ వీరేంద్ర ఆధ్వర్యంలో, మండల ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దిలేటి మదాసి కురువ సమక్షంలో ఈ సమావేశం జరిగింది. మైనార్టీ మోర్చా మండల అధ్యక్షులు షేక్ చాంద్ భాషా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం ఈ సందర్భంగా పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ప్రతి ఒక్క పౌరుడిని కలుపుకొని, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి బీజేపీ సీనియర్ నాయకులు సాల్వాడి సురేంద్ర మాట్లాడుతూ..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులకు ఆర్థిక సహాయం పొందే అవకాశాలు కల్పిస్తున్నదని వివరించారు.అన్ని సామాజిక వర్గాల సంక్షేమానికి బీజేపీ కట్టుబాటు బీజేపీ కోడుమూరు మండల అధ్యక్షులు బోయ వీరేంద్ర మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ అన్ని సామాజిక వర్గాల ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.కోడుమూరు మండల బీజేపీ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దిలేటి మదాసి కురువ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంతరం ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కోడుమూరు గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీకి సంతోషకరమైన విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు అశోక్ గారు, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆవుల రమేష్, సీనియర్ నాయకులు కృష్ణ ,వెంకట రామయ్య ఆచారి , నరేష్ ,శివ గోవింద్ తదితర బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు నగరపాలకలో అర్జీల స్వీకరణ

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. కాలనీల్లో మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పరిశుభ్రత తదితర సమస్యలను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని సూచించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు రాలేని పౌరులు 7422992299 నంబర్‌కు కాల్ చేయడం లేదా వాట్సాప్ సందేశం ద్వారా తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు.

## రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుల పర్యటన

**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 04(నంది పత్రిక):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప ఈనెల 5, 6 తేదీల్లో నంద్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు ఐటీడీఏ (పీవీటీజీ-చెంచు), శ్రీశైలం ప్రాజెక్ట్ అధికారి పి.వి.ఎస్. నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా అక్టోబర్ 6వ తేదీ ఉదయం 9.30 గంటలకు సున్నిపెంటలోనిబాూ (బాలుర) పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి, వారి సమస్యలు మరియు అవసరాలను తెలుసుకోనున్నారు. ఉదయం 11 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ సిబ్బంది, ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన, గిరిజన సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు దోర్నాల మండలం మర్రిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీని సందర్శించి గిరిజనులతో నేరుగా సంభాషించనున్నారు. గిరిజనుల జీవన పరిస్థితులు, స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అవసరాలను క్షేత్రస్థాయిలో తెలుసుకోనున్నారు. గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని సంబంధిత అంశాలపై సమీక్ష చేయడం జరుగుతుందన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న గుజ్జుల గౌరీశ్వర నాయుడు



**నందికొట్కూరు అక్టోబర్ 4(నంది పత్రిక )** కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో కార్యాలయ సహాయకుడిగా ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఖాజా బాషా కుమారుడు అమ్రాన్ ఇస్మాయిల్ బాషాఅస్మా వివాహం జరిగిన సందర్భంగా, సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతుల నికాహ్ జోగులాంబ గద్వాల్ జిల్లా, ఆలంపూర్ న్యూ ప్లాట్స్‌లోని బి.ఆర్.ఎస్. ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, కలకాలం ఆనందంగా జీవించాలని, అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ వారిపై ఉండాలని గుజ్జుల గౌరీశ్వర నాయుడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, నందికొట్కూరు పట్టణ కార్యదర్శి కాటేపోగు సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం



**వెలుగోడు అక్టోబర్ 04నంది పత్రిక:** వెలుగోడు పట్టణంలోని స్థానిక లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో 'మెర్సీ సొసైటీ' ఆధ్వర్యంలో, స్కూల్ చైర్మన్ ఎం ఎఫ్ ఇమ్మాన్యుయెల్ సహకారంతో, కర్నూలు శాంతిరామ్ హాస్పిటల్ వైద్య బృందం నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి, తగిన వైద్య సలహాలు అందించారు. ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన అర్హులైన రోగులకు శాంతిరామ్ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎం ఎఫ్ ఇమ్మాన్యుయెల్ మాట్లాడుతూ "ప్రజలకు సేవ చేయడమే మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక ఉచిత ఆరోగ్య సేవా కార్యక్రమాలను నిర్వహిస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన శాంతిరామ్ హాస్పిటల్ వైద్యులకు, సిబ్బందికి, మెర్సీ సొసైటీ సభ్యులకు, మరియు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## శరన్నవ రాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల.

**బేతంచెర్ల అక్టోబర్ 04 ( నంది పత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచర్ల పట్టణంలోగల అమ్మవారి శాలలో,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం నాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా గోపాల్ ఆధ్వర్యంలో సంఘం కార్యదర్శి బివి.సుబ్రహ్మణ్యం కోశాధికారి కంద గడ్డల రామ మూర్తి దసరా కమిటీ చైర్మన్ యల్ల రామయ్య, ఆర్య వైశ్య పెద్దలు,ఆర్యవైశ్య మహిళలు మరియు ఆర్యవైశ్య ప్రతినిధు సమక్షంలో శరన్నవ రాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించడం జరిగింది.



# గురువుల ఆశీస్సులతో.. మధుర జ్ఞాపకాలతో!

### ఘనంగా జడ్పీహెచ్ఎస్ 20002001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### 23 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు..

### మేళతాళాలతో గురువులకు ఘన స్వాగతం

**వెలుగోడు, అక్టోబర్ 04 (నంది పత్రిక):**వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20002001 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడినప్పటికీ పాఠశాలతో, గురువులతో తమకున్న అనుబంధాన్ని మరువకుండా ప్రత్యేకంగా తరలివచ్చి ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ పలకరింపులతో సందడిగా మారింది.

**మేళతాళాలతో గురువులకు ఘన స్వాగతం**

ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన తమ గురువులకు పూర్వ విద్యార్థులు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి ఉపాధ్యాయులను మేళతాళాలు, బాణాసంచా మధ్య పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. గురువులను విద్యార్థులు ఘనంగా ఆహ్వానించడంతో పాఠశాల పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.అనంతరం పాఠశాల ప్రాంగణంలో సరస్వతి దేవి, మహాత్మా జ్యోతిరావు పూలేసావిత్రిబాయి పూలే దంపతులు, ఫాతిమా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభించారు.మరణించిన గురువులు, పూర్వ విద్యార్థులకు నివాళి తమకు విద్యాబుద్ధులు నేర్పి జీవితానికి మార్గదర్శకులుగా నిలిచినప్పటికీ ప్రస్తుతం స్వర్గస్తులైన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు స్మరించుకున్నారు. అలాగే తమతో కలిసి చదువుకున్న, కాలంచెల్లిన పూర్వ విద్యార్థుల ఆత్మశాంతిని కాంక్షిస్తూ సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళు లర్పించారు.చిన్ననాటి జ్ఞాపకాలతో ఆనందందాదాపు 23 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలలో కలిసి చదువుకున్న రోజులు, తరగతి గది అనుభవాలు, ఆటపాటలు, గురువుల బోధనలు, అప్పటి స్నేహాలు తదితర విషయాలను గుర్తుచేసుకుంటూ సరదాగా ముచ్చటించారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థి దశలో తమకు ఎదురైన అనుభవాలను, అప్పటి పరిస్థితులను గుర్తుచేసుకుంటూ పలువురు పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. చదువుకున్న పాఠశాల, నేర్పిన గురువులు, కలిసి పెరిగిన స్నేహితులు జీవితాంతం మరువలేని జ్ఞాపకాలుగా మిగిలిపోతారని పేర్కొన్నారు.

**గురువులకు ఘన సన్మానం** తమ జీవితాలకు పునాది వేసిన గురువుల పట్ల పూర్వ విద్యార్థులు తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, సంజీవ రాజు, రాబర్ట్, మక్బుల్ భాష, నాగిరెడ్డి, సుదర్శనం, స్వరూప, సరస్వతి, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, ఎస్. సలీం, జె. మొహమ్మద్ రఫీ, అయ్యవారిపల్లె రామ సుబ్బయ్య, రామ్మూర్తి, ఎం.డి. షఫీ, జె. సుల్తాన్ మొహిద్దీన్, యాదాటి రవీంద్రుడు దంపతులు, ఆచారి తదితరులను నూతన వస్త్రాలు, శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.అలాగే పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డిని కూడా ఘనంగా సన్మానించారు. గురువులను సత్కరించే కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.పాఠశాల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి పాఠశాల, ఉపాధ్యాయులు అందించిన విద్య, క్రమశిక్షణే పునాది అని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తూ, ప్రస్తుత విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పలువురు ఆకాంక్షించారు.ఇన్నేళ్ల తర్వాత తమ గురువులు, స్నేహితులను ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలు పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గురువుల ఆశీస్సులు, స్నేహితుల ఆత్మీయ పలకరింపులతో జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం ఆద్యంతం భావోద్వేగభరితంగా, సందడిగా మారింది.



# ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు తీవ్ర అన్యాయం

**మాల ప్రజల పై జరుగుతున్న దాడులను అరికట్టండి**

**వచ్చే స్థానిక ఎన్నికలలో మాలల సత్తా ఏంటో చూపిస్తాం**

**మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి**

నంద్యాల బ్యూరో, అక్టోబర్04(నంది పత్రిక):- ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైసి పుల్లయ్య ఆరోపించారు. ఆదివారం నంద్యాల పట్టణంలో మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షుడు బండి దేవాంతకుడు అధ్యక్షతన మాలల జిల్లా స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దస్తగిరి, వైసీ పుల్లయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వలన మాలలకు అన్యాయం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానం మాలలపై దాడులు హత్యాచారాలు అధికమయ్యాయని వారు ఆరోపించారు. దళితులకు సంబంధించి గత వైసిపి ప్రభుత్వం 26 దళిత పథకాలను రద్దుచేసి ఓడిపోయిందని వారు అన్నారు. ఎన్నికల ముందు దళిత పథకాలు ప్రవేశపెడతామని కూటమి ప్రభుత్వము హామీ ఇచ్చి రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే దళితుల సమస్యలు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. మాలలకు ఎంతో నష్టమైన జీవో నెంబర్ 102 ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అన్ని సమస్యలపై నంద్యాల పట్టణంలో నవంబర్ మాసంలో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు టి అశోక్ బాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ బాబు ఇతర మాల ప్రముఖుల హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి, స్మశాన కార్మిక హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తలారి నాగరాజు, మద్దూరు మాజీ సర్పంచ్, మాల రాజ్యాధికారి సభ నంద్యాల జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, నంద్యాల జిల్లా జేఏసీ అధ్యక్షులు కొప్పెర రాజేంద్ర, రాష్ట్ర కార్యదర్శి అంకన్న, రాయలసీమ అధ్యక్షులు అబ్రహాము, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రోజక్క, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం రాజ్ కుమార్ వివిధ మండలాల నుండి వచ్చిన మాల మహానాడు మండల నాయకులు మాల కార్యకర్తలు పాల్గొన్నారు



## ఎపి మోడల్ స్కూల్ నందు పాము కలకలం.



బేతంచెర్ల అక్టోబర్ 04 ( నంది పత్రిక ). బేతంచర్ల మండలం ఎపి మోడల్ స్కూల్ లో పాము కనిపించడంతో కలకలం రేగింది. ఆదివారం ఉదయం ఆరడుగుల జెర్రిపోతూ పాము పాఠశాలలోకి దూరింది.పాఠశాలలో చదువు కుంటున్న విద్యార్థినీలు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు.బేతంచర్ల కు చెందిన స్నేక్ క్యాచర్ మహబూబ్ హుస్సేన్ కు పాఠశాల సిబ్బంది పామును గూర్చిన సమాచారం అందించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థినీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా,ఆపామును మహబూబ్ హుస్సేన్ పట్టు కున్నారు. పాఠశాలకు దూరంగా కొండ శివారులలో పామును వదిలి పెట్టడం జరుగు తుందని మహబూబ్ హుస్సేన్ తెలిపారు. పాఠశాలలో పామును పట్టుకొని పోవడంతో విద్యార్థినీలు భయాన్ని వదిలి ప్రశాంతంగా గడుపు తున్నారు.

## దూదేకుల ప్రజలకు కౌన్సిలర్ గా పోటీ చేసే అవకాశం కల్పించాలి: దూదేకుల మహాభాషా



నందికొట్కూరు అక్టోబర్ 4(నంది పత్రిక ) దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎస్ బాజీ ఆదేశాల మేరకు నందికొట్కూరు మున్సిపల్ ఎన్నికలలో దూదేకుల సామజిక వర్గానికి అన్ని పార్టీ లు కౌన్సిలర్ గా పోటీ చేసే అవకాశం కల్పించాలని నందికొట్కూరు నియోజకవర్గ దూదేకుల సంఘం అధ్యక్షులు మహా భాషా తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీలో దాదాపుగా 36000 ఓట్లు ఉంటే, కేవలం మా దూదేకుల సామజిక వర్గానికి చెందిన ఓట్లు దాదాపుగా 3వేలకు పైగా ఉన్నాయని, కచ్చితంగా అన్ని రాజకీయ పార్టీ లు కనీసం 3 కౌన్సిలర్ సీట్లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.నందికొట్కూరు పట్టణ అభివృద్ధి లో మా దూదేకుల జాతి పాత్ర ఉండాలననే ఉద్దేశం తో మా దూదేకుల జాతికి అన్ని పార్టీ లు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఒకవేళ ఏ పార్టీ మా దూదేకుల జాతికి అవకాశం కల్పించకపోతే మా ఓటు బ్యాంకు ఉన్న అన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థులు గా పోటీ చేయిస్తామని ఆయన అన్నారు. కౌన్సిలర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ కి కూడ పోటీ చేయిస్తామన్నారు.

# 25 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులు.. గురువుల సమక్షంలో ఆత్మీయ సమ్మేళనం





**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

డోన్ : నంది పత్రిక అక్టోబర్ 4 డోన్ పట్టణంలోని ఎస్‌కేపీ హైస్కూల్‌లో 20002001 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒక్కచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాత మిత్రులంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. నాటి తరగతి గది అనుభవాలు, ఆటలు, స్నేహబంధాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు.

ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. గురువుల ఆశీస్సులు తీసుకుని, పాఠశాలలో తమకు అందించిన విద్య, క్రమశిక్షణ, విలువలను గుర్తు చేసుకున్నారు. గురువులు కూడా పూర్వ విద్యార్థులను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ, వారి ప్రస్తుత జీవిత ప్రస్థానం గురించి తెలుసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు, గురువులు ఒకే వేదికపై కలవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో గడిపిన రోజులు తమ జీవితంలో ఎన్నటికీ మరచిపోలేని మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోయాయని తెలిపారు. తమకు విద్యతో పాటు మంచి నడవడి, క్రమశిక్షణ, మానవతా విలువలు నేర్పిన గురువులను ఎప్పటికీ మరువలేమన్నారు. కాలం గడిచినా స్నేహబంధాలు చెక్కుచెదరకుండా ఉండటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం తమ కుటుంబ, వృత్తి జీవిత విశేషాలను తెలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. భవిష్యత్తులోనూ ప్రతి సంవత్సరం ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తూ పాత స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళికా మాత దేవస్థానంలో ఈనెల 11 నుండి దసరా ఉత్సవాలు

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 4, నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని విశ్వరూప పారిశ్రామిక నగర్ లో శ్రీశ్రీశ్రీ కాళికామాత దేవస్థానము నందు ఈనెల 11వ తేదీ నుండి 21వ తేదీ వరకు శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని శ్రీకాళికా మాత దేవాలయం కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసాచారి ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.11వ తేదీ కలశస్థాపనతో ప్రారంభించి 16 వ తేదీన బిందె సేవ, 18 వ తేదీన దుర్గాష్టమి, 20వ తేదీ విజయదశమి రోజున గ్రామోత్సవం,21వ తేదీ వసంతోత్సవం మరియు అన్నప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని, ఈ నవరాత్రులలో ప్రతిరోజూ సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునని అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయబడినదని కావున భక్తులు ఈ నవరాత్రులలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ కాళికామాత వారి అనుగ్రహానికి పాత్రులుకాగలరని దేవస్థాన కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసచార్యులు మరియు ఉపాధ్యక్షులు ముత్తలూరు సురేష్ ఆచార్యులు తెలియజేశారు.. ఈ కార్యక్రమం నందు కమిటీ గౌరవాధ్యక్షులు కోటేశ్వరరావు ఆచార్యులు, పెద్ద సుబ్బయ్య ఆచార్యులు, చిన్న పుల్లయ్య ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి యాడికి గోపాలచార్యులు, క్యాషియర్ రామ్మోహన్ ఆచార్యులు, గుండ్లకుంట సుబ్బయ్య ఆచార్యులు, సుబ్రహ్మణ్యం ఆచార్యులు, దేవస్థాన పురోహితులు చంద్రశేఖర ఆచార్యులు, వెంకటేశ్వర ఆచార్యులు, పురుషోత్తమాచార్యులు, దేవ పూజ హరికృష్ణ ఆచార్యులు, మరియు దేవస్థాన మహిళా కమిటీ అధ్యక్షురాలు కమ్మరి విశాలక్ష్మి , ఉపాధ్యక్షురాలు పన్నీరు పుల్లమ్మ, ప్రధాన కార్యదర్శి హరీషా దేవి, సభ్యురాలు ఉదయభాను, సావిత్రమ్మ ,శ్రీదేవి, జమీల మొదలగువారు పాల్గొన్నారు

# సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు...!





**జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు**

**అమృత్‌నగర్‌లో రెండు హెలీప్యాడ్లు, జలజీవన్ మిషన్అమరజీవి జలధార లాంచింగ్ పైలాన్ పరిశీలన**

ప్రొద్దుటూరు, బ్యూరో చీప్ అక్టోబర్ 4 : నంది పత్రిక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంయుక్తంగా అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి ప్రొద్దుటూరు అమృత్‌నగర్‌లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన రెండు హెలీప్యాడ్లను పరిశీలించారు. హెలీప్యాడ్ల వద్ద భద్రత, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ఇతర అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం జలజీవన్ మిషన్అమరజీవి జలధార కార్యక్రమ లాంచింగ్ కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీలు భద్రతా ఏర్పాట్లు, వీఐపీ గ్యాలరీలు, సభా వేదిక, ప్రజల గ్యాలరీలు, పార్కింగ్, రాకపోకల మార్గాలు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో చర్చించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వైద్య సదుపాయాలు, పార్కింగ్, రవాణా తదితర సౌకర్యాలు సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. కార్యక్రమం విజయవంతంగా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీల వెంట పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. స్థానికంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, సభా ప్రాంగణానికి ప్రజల రాకపోకలకు సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పర్యటనకు సంబంధించిన ప్రతి ఏర్పాటును సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షించాలని, ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు, స్థానిక నాయకులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 4 ( నంది పత్రిక ) నంద్యాల పట్టణం ఫరూక్ నగర్ లోని షిఫా వైద్యశాలలో ఆదివారం జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ హాది సయీది అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఉచితంగా అందజేసి మందులను పంపిణీ చేశారు. ప్రముఖ సర్జన్ డాక్టర్ చిట్టిబాబు, డాక్టర్ రాజారెడ్డి ఐసియు, రిహాబ్ స్పెషలిస్ట్, డాక్టర్ భారతి సన్నపురెడ్డి, న్యూరో స్పెషలిస్ట్, డాక్టర్ శ్రీ వల్లిక స్కిన్ స్పెషలిస్ట్ వైద్య సేవలందించారు. దాదాపు 500 మంది రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ హాది సయీది తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతుల్ ఉలేమా వల్ అయిమ్మ ఫౌండేషన్ నాయకులు మౌలానా హుసేన్ రషాది, మూలాన ఇద్రిస్, హాఫిజ్ మహమ్మద్ రియాజ్, మహమ్మద్ ముస్తఫా, మొహమ్మద్ షరీఫ్ సాహెబ్, మౌలానా మొహమ్మద్ ఫిదా హుసేన్, మౌలానా అబ్దుల్లా మాట్లాడుతూ ఫరూక్ నగర్ లాంటి మైనారిటీ ప్రాంతంలో పేదలు అధికంగా ఉంటారని, వారికి ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు తమ వంతు సహాయంగా ఈ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చామని, అలాగే ఈ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో షిఫా మెడికల్ యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ మండల విస్తృతస్థాయి సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ



కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో ఎన్.వి ఫంక్షన్ హాల్ నందు భారతీయ జనతా పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ సూచనలతో కర్నూలు రూరల్ మండల అధ్యక్షులు రవి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం ఈ సందర్భంగా పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ ప్రతి ఒక్క పౌరుడిని కలుపుకొని, అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఆవుల రమేష్ ,మధు కిషోర్ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుపై అదుపుతప్పిన బైక్ వ్యక్తికి తీవ్ర గాయాలు

మొండికుంట మెయిన్ రోడ్డుపై ఏర్పడిన భారీ గోతుల్లో అదుపుతప్పి ద్విచక్ర వాహనం కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాల య్యాయి. వెంటనే స్థానికులు అతడిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.రోడ్డుపై గుంతలు కాదు.. ప్రమాదాలకు ఆహ్వానం పలికే మృత్యుకుహరాలు" అంటూ స్థానికులు ఆవేదన

## షాదీఖానా ను ప్రారంభించిన న్యాయ శాఖ మంత్రి ఫరూక్, ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఓర్వకల్లు హుస్సేనాపురం గ్రామంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన నారావారి షాదీఖానాను మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్.ఎం.డి. ఫరూక్ మరియు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన పాణ్యం నియోజవర్గం ఎమ్మెల్యే టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ, మరియు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో షాదీఖానాల నిర్మాణానికి ఎస్టిమేట్లు పంపించాలని, నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హుస్సేనాపురం గ్రామం లో మసీదు నిర్మాణం, పునర్నిర్మాణానికి కూడా ఎస్టిమేట్ పంపించాలని సూచించాము. షాదీఖానాను అన్ని వర్గాల ప్రజలు వివాహాలు, శుభకార్యాలకు వినియోగించుకునేలా ఏర్పాటు చేశాము అని తెలిపారు.

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్ఫూర్తి చిరస్థాయిగా నిలిచేలా పార్కు అభివృద్ధి

### పార్క్ అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**కోవెలకుంట్ల అక్టోబర్ 4నంది పత్రిక** బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర, నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. కోయిలకుంట్లలోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి స్వయంగా పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజల్లో దేశభక్తి, ధైర్యం, ఆత్మగౌరవం వంటి విలువలను నింపిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆ మహనీయుడి పోరాట స్ఫూర్తిని ప్రతిబింబించేలా పార్కును అభివృద్ధి చేయడంతో పాటు, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం, చారిత్రక అవగాహన కల్పించే విధంగా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.

**చరిత్రను కళ్లముందు నిలిపేలా పార్క్** ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రారంభ సాయుధ ప్రతిఘటనల చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉందని మంత్రి అన్నారు. ఆయన త్యాగం, పోరాట పటిమ, ప్రజల కోసం నిలబడిన ధైర్యం యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆ చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల జాబితాలో చేర్చడం ఆయన చారిత్రక ప్రాధాన్యతకు నిదర్శనమని, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు.

## ఉచ్చుల తొలగింపు పై అటవీ శాఖ అవగాహన



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 4:** వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా అటవీశాఖ ఉచ్చుల తొలగింపు పై అవగాహన కార్యక్రమం చేపట్టింది. ఆదివారం నారపురెడ్డి కుంట సెక్షన్లో సిబ్బంది తోపాటు ప్రొటెక్షన్ వాచర్లు మంగలేటి కాలువ, గంగమ్మ గుడి ,కానుగ కూపే తో పాటు ఫ్రెండ్షిప్ గ్రామ సరిహద్దులలో ఉచ్చుల తొలగింపు డ్రైవ్ను నిర్వహించారు. గాలి చెన్నయ్యపాలెం సెక్షన్ లో సిబ్బంది ప్రొటెక్షన్ వాచర్లు నెమళ్ళకుంట చెంచుగూడెం ప్రాంతంలో ఉ చ్చుల తొలగింపు పై డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రిడ్జ్ గ్రామాలైన చిన్నదేవులాపురం బరకల కాలనీలో నివసించే ప్రజలు గొర్రెల కాపలాదారులకు ఉచ్చుల తొలగింపు వన్యప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతపై ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల కాపలాదారుల చేత ప్రమాణం చేయించారు. ఉచ్చుల తొలగింపు డ్రైవ్ ద్వారా నిరోధించడంపై దృష్టి సారించడం జరిగిందని పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ పై అవగాహన కల్పించడంతోపాటు మానవ వన్యప్రాణుల సమన్వయాన్ని సాధించడాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. వన్యప్రాణుల వేటను నిరోధించడం ,ఉచ్చుల వాడకంపై అవగాహన కల్పించడంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ,మానవ వన్యప్రాణి సమన్వయాన్ని సాధించడాన్ని లక్ష్యాలుగా నిర్ణయించారు. ప్రాజెక్టు టైగర్ నంద్యాల అధికారి డాక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా ఆధ్వర్యంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు అత్యంత ఉత్సా హంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ శాసనసభ్యులు, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. సమాజంలో రెడ్‌క్రాస్ సేవా కార్యక్ర మాలను మరింత ముందుకు తీసుకెళ్లే నూతన పాలకవర్గ ఎంపిక కోసం జరుగుతున్న ఈ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.ఈ పోలింగ్ ప్రక్రియ లో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రెడ్‌క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగి ంచుకున్నారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**నకిలీ ఐపీఓలు, షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో సైబర్ మోసాలు.**

**అధిక లాభాల ఆశ చూపి సైబర్ నేరగాళ్ల వలలోకి లాగుతున్న మోసగాళ్లు.**

**గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు, గ్రూపుల ద్వారా పెట్టుబడులు పెట్టొద్దు.**

**సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి.**

**కర్నూలు జిల్లా యస్ పి విక్రాంత్ పాటిల్ ఐపీయస్**



**కర్నూలు సిటీ నందిపత్రిక** ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల వలలో పడకుండా జాగ్రత్త వహించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఇటీవల స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, షేర్లు, నకిలీ ఐపీఓల (ఐ పి ఓ ) పేరుతో ప్రజలను బురిడీ కొట్టించే కేసులు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని తెలిపారు.అధిక లాభాల పేరుతో సైబర్ మోసాలు...అధిక లాభాలు ఆశజూపుతూ, ప్రముఖ కంపెనీల ఐపీఓ (ఐ పి ఓ ) షేర్లు సులభంగా కేటాయిస్తామంటూ సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాల ద్వారా లేదా ఫోన్ కాల్స్ ద్వారా సంప్రదిస్తున్నారు.వందల, వేల సంఖ్యలో షేర్లు అలాట్ అయ్యాయని, ఒక్కో షేరు విలువ త్వరలోనే భారీగా పెరుగుతుందని నమ్మిస్తారు.ఆ షేర్లను కొనుగోలు చేయాలంటూ బాధితుల వద్ద నుంచి ముందస్తుగా పెద్ద మొత్తంలో డబ్బులను గుర్తుతెలియని ఖాతాల్లోకి జమచేయించుకుంటున్నారు. బాధితులు నగదు బదిలీ చేసిన తర్వాత ఆ షేర్లు కేటాయించ బడకపోవడంతో పాటు, సైబర్ మోసగాళ్లు అందుబాటులోకి రాకుండా పోతున్నారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...** అధీకృత సెబీ (సెబీ ) గుర్తింపు పొందిన బ్రోకర్లు లేదా అధికారిక బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా కాకుండా గుర్తుతెలియని వ్యక్తులు, లింకులు లేదా గ్రూపుల ద్వారా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవద్దు.

తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయనే ఆశతో వచ్చే సందేశాలు, కాల్స్‌ను అస్సలు నమ్మవద్దు.

అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సైబర్ మోసానికి గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సైబర్‌క్రైమ్ .గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అహోబిలం శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజెంద్రారెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 4 నంది పత్రిక,** ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజెంద్రా రెడ్డి ఆదివారం అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అహోబిల గ్రామస్థులకు డోలి విరాళం చేశారు. అనంతరం అహోబిలం గ్రామం వై ఎస్ ఆర్ సి పి నాయకులు నాసారి వెంకటేశ్వర్లు ( సీసా ) ఆధ్వర్యంలో నిర్వహించిన గంగమ్మ తల్లి పొంగలి ఉత్సవంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహోబిలంలో వర్షాలు లేక పంటలు సరిగా లేక రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుందన్నారు. వర్షాబావ పరిస్థితులను బట్టి అహోబిలంలో వర్షాలు బాగా కురువాలని గంగమ్మతల్లి పొంగలి ఉత్సవం నిర్వహించడం జరిగిందన్నారు. ఆ గంగమ్మ తల్లి దయతో మంచిగా వర్షాలు కూరవాలని, రైతులు సుబిక్షంగా వుండాలని గంగమ్మ తల్లిని వేడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం పి పి గజ్జల రాఘవేంద్రా రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ గంధం వీర రాఘవ రెడ్డి, కందుకూరు రాజగోపాల్ రెడ్డి అహోబిలం వైసీపీ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రచార ఆర్భాటాలు కాదు ఉద్యోగాలు కల్పించండి ఏఐవైఎఫ్



**కర్నూలు సిటీ నందిపత్రిక** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానికి ప్రచార ఆర్భాటాలపై ఉన్న శ్రద్ధ వారికి ఓట్లు వేసి గెలిపించిన యువత పట్ల లేకపోవడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సంతోష్ కుమార్ యుగంధర్ లు విమర్శించారు ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా నిర్మాణ మహాసభలో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అలా చేయలేని పక్షంలో నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తా ఉన్న నిరుద్యోగ భృతి ఇవ్వడానికి నిధులు లేవని చెప్పే కూటమి ప్రభుత్వం వారి ప్రచార ఆర్భాటాల కోసం సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ డబ్బులు చెల్లిస్తామని చెప్పడం అత్త సొమ్ము అల్లుడు దానం చేయడం లాంటిదే అని వారి మండిపడ్డారు కావున ఎన్నికల్ లో యువతకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు సాధించడం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు అనంతరం కర్నూలు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా నూతన అధ్యక్షులుగా సి రమేష్, జిల్లా కార్యదర్శిగా కె శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం బిసన్న జిల్లా ఉపాధ్యక్షులుగా ఏం రాజు, అంజిత్ గౌడ్, రంగస్వామి, సహాయ కార్యదర్శిలుగా రాజీవ్, హనుమేష్ లతో పాటుగా 41 మందిని జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్టు వారు ప్రకటించారు.

## కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం



**డోన్ : నంది పత్రిక అక్టోబర్ 4** జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రొద్దుటూరులో నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జనసమీకరణ పరిశీలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు పుత్తా నరసింహారెడ్డి హాజరై మండలాల ముఖ్య కూటమి నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, వి.ఎన్.పల్లి, కమలాపురం, సి.కె.దిన్నె, చెన్నూరు, వల్లూరు మండలాల నుంచి ప్రజలను పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని నాయకులు ఆదేశించారు. ప్రతి మండలం నుంచి వచ్చే ప్రజల కోసం తగిన సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, భోజన వసతి, తాగునీరు, వైద్య సహాయం వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రయాణ సమయంలో, కార్యక్రమ ప్రాంగణంలో ప్రజల భద్రతకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండలాల వారీగా జనసమీకరణపై ప్రత్యేక దృష్టి సారించి, నాయకులు, కార్యకర్తలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అందరి సమన్వయంతో జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**బనగానపల్లె అక్టోబర్ 4నందిపత్రిక** బనగానపల్లెలో నిర్మాణంలో వివిధ భవన నిర్మాణ పనులను మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు.నూతన ఆర్డీవో కార్యాలయ భవనాన్ని పరిలించి పనుల పురోగతిపై అధికారులను ప్రశించారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం ఆంజనేయ స్వామి వీధిలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించి డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.యాగంటి పల్లె రోడ్డులో జరుగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై రోడ్డు భవనాల శాఖ అధికారులను ప్రశ్నించారు అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.



## నేరేడ్‌మెట్‌లో కాంగ్రెస్‌కు భారీ బలం మైనంపల్లి సమక్షంలో చేరికలు

మల్కాజిగిరి నియోజకవర్గం నేరేడ్‌మెట్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. మహాబోధి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయ కులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, కాలనీ సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మైనంపల్లి హనుమంతరావు వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నేరేడ్‌మెట్ రజక సంఘం, ద్విచక్ర వాహనాల మెకానిక్ అసోసియేషన్, వివేకానందపురం, ఆర్‌కేపురం, సీబీఎన్ కాలనీకి చెందిన యువతతో పాటు వివిధ కాలనీలకు చెందిన పలువురు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరారు.

# యాదావిధిగా నేడు (అక్టోబర్ 5న) జిల్లా, డివిజన్, మండల కేంద్రాల లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్, అక్టోబర్4, నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంఅక్టోబర్ 5వ తేదీన జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్ మరియు మండల కేంద్రాలలో నిర్వ హించబడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారులి. అదేవిధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సంబంధిత ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ, పరిశీలన మరియు పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా మరియు మండల స్థాయి అధికారుల సమన్వ యంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయబడి నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను అధికారిక వెబ్‌సైట్ ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా నమోదు చేసుకో వచ్చని తెలిపారు. అర్జీల స్థితి, పరిష్కా ర ప్రక్రియ లేదా ఇతర సమాచారం కోసం "మీకోసం" టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100 ను సంప్ర దించవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి మిమ్మల్ని సంప్రది స్తారని అన్నారు. నడవలేని వారు, మంచానికే పరిమి తమైన వారు, తీవ్రమైన అనారో గ్యంతో బాధపడు తున్న వారిని పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలకు తీసుకు రాలవద్దని తెలిపా రు.అలాంటి వారి సమస్యలను కుటుంబ సభ్యులు లేదా ప్రతినిధుల ద్వారా తెలియ జేయవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్‌కు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడినట్లు తెలిపారు. అందిన అర్జీలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కా రానికి తక్షణ చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఈ నెల 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** జిల్లా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను అక్టోబర్ 5, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా ఈ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించే సమయంలో పేరు, పూర్తి చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు సమస్యకు సంబంధించిన సమగ్ర వివరాలను స్పష్టంగా పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. సమస్యకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లను అర్జీతో పాటు జతచేయాలని తెలిపారు. ఇప్పటికే ఇదే సమస్యపై గతంలో ఫిర్యాదు చేసిన వారు తమ పాత అర్జీ రశీదు/ఫిర్యాదు రసీదును వెంట తీసుకురావాలని సూచించారు. దీనివల్ల పాత ఫిర్యాదు వివరాలను పరిశీలించి, తదుపరి చర్యలను వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌కు వ్యక్తిగతంగా హాజరై అర్జీ సమర్పించలేని ప్రజలు కూడా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న 1100 టోల్‌ఫ్రీ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా తమ ఫిర్యాదులను నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్జీల స్వీకరణ ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు డివిజన్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. తమ ప్రాంతానికి సమీపంలోని సంబంధిత కార్యాలయాలను ప్రజలు సంప్రదించి సమస్యలను నమోదు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు

# ప్రకాశ్ రాజ్ ఎర్రగడ్డ వైద్య నిపుణులకు చూపించుకోవాలి: విష్ణువర్ధన్ రెడ్డి వ్యంగ్యం

**ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి**

**రాజకీయ విమర్శకు, వ్యక్తిగత దూషణకు మధ్య గీత దాటారంటూ ఆరోపణ**

**ప్రకాశ్ రాజ్ మానసిక ఆరోగ్యంపై సంచలన వ్యాఖ్యలు**

**"ఎర్రగడ్డ" వైద్య నిపుణులను సంప్రదించాలని సూచన**

**ప్రజాస్వామ్యానికి బూతుల గొంతుక అవసరం లేదంటూ చురకలు**



ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ సంయుక్త సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో, ఘాటుగా స్పందించారు. ప్రకాశ్ రాజ్ తన మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, అవసరమైతే "ఎర్రగడ్డ" వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని వ్యంగ్యం ప్రదర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ప్రతిగా విష్ణువర్ధన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు.విష్ణువర్ధన్ రెడ్డి తన పోస్టులో, "ప్రకాశ్ రాజ్ గారూ, హైదరాబాద్‌లో మీ మీడియా సమావేశం చూస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ విమర్శకు, వ్యక్తిగత దూషణకు మధ్య ఉన్న గీతను మీరు దాటారు. బీజేపీ పార్టీని, నేతలను అసభ్య పదజాలంతో దూషించడం విమర్శ కాదు. మీ తాజా వ్యాఖ్యల్లో కనిపించిన ఆవేశం ఆందోళన కలిగిస్తోంది. మీ ఆరోగ్యం, మానసిక ఒత్తిడి విషయంలో 'ఎర్రగడ్డ' వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది" అని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో విమర్శకు చోటు ఉందని, అయితే అది హుందాగా ఉండాలని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. "విమర్శ ఉండాలి.. అసభ్యత కాదు. ప్రజాస్వామ్యంలో బలమైన గొంతుక అవసరం కానీ, బూతుల గొంతుక కాదు" అంటూ తన పోస్టులో చురకలంటించారు. కాగా, శనివారం నాడు హైదరాబాద్‌లో ప్రకాశ్ రాజ్ మీడియా సమావేశం నిర్వహించి, ఎస్ఐఆర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై, బీజేపీ నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన వ్యాఖ్యలకు బీజేపీ నుంచి గట్టి కౌంటర్ ఎదురైంది.

# బాలల హక్కుల పరిరక్షణపై కమిషన్ సభ్యురాలి పర్యటన

## 06, 07 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో పలు సంస్థల తనిఖీ,



**విజయవాడ బ్యూరో చీఫ్ , అక్టోబర్ 4 నంది పత్రిక** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు శ్రీమతి కె.జి. పద్మలత అక్టోబర్ 06,07 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో బాలల హక్కుల చట్టాల అమలు, సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టనున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి శ్రీమతి షేక్ రుక్సానా సుల్తానా బేగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 06న అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు మరియు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలను కమిషన్ సభ్యురాలు సందర్శించి పరిశీలిస్తారు. అనంతరం ప్రభుత్వ బాలుర వసతి గృహ లను తనిఖీ చేస్తారు.అక్టోబర్ 07న సంరక్షణ కేంద్రాల సిబ్బందితో బాలల హక్కులు, అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమలపై సమీక్షా నిర్వహిస్తారు. తరువాత కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శిస్తారు. అక్కడ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తారు. కమిషన్ సభ్యురాలి పర్యటనలో ఎలాంటి సమన్వయ లోపాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం సంబంధిత అధికారులను ఆదేశించింది. కేటాయించిన విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# పేదల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యత

## గద్దె రామమోహన్ చేతుల మీదుగా సంజయ్‌గాంధీ నగర్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ





**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** పేద ప్రజల సంక్షేమం, భద్రతకు తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 12వ డివిజన్ (కొత్త 19వ డివిజన్) లోని లాకుల రోడ్డు, సంజయ్‌గాంధీ నగర్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మరియు రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను ఆయన స్వయంగా వారికి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ సంజయ్‌గాంధీ నగర్ కాలనీలో అర్హులైన 46 మంది పేద కుటుంబాలకు వివిధ జీవోల (జీవో నెం. 30, 306, 615, 618 మొదలైనవి) కింద ఎలాంటి ఖర్చు లేకుండా పూర్తిగా ఉచితంగా రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు అందచేస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాలపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా వారికి సమాజంలో సముచిత గౌరవం, ఆర్థిక భద్రత మరియు ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని గద్దె రామమోహన్ అన్నారు. ఈ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల ద్వారా లబ్ధిదారులు అవసరమైనప్పుడు బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. పేద ప్రజల సంక్షేమం, భద్రత కోసమే తమ కూటమి ప్రభుత్వం అనేక రకాల జీవోల ద్వారా ఈ హక్కులను కల్పిస్తోందని, నిరుపేదల అభ్యున్నతికి ఇటువంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మమ్మనేని ప్రసాద్, నూతి శ్రీను, సొంఠి సాయి లక్ష్మి, రాధారపు ఎల్ల బాబు, మాదిరెడ్డి రవి, కొర్రపాటి శ్రీను, మేదరమెట్ల నారాయణ, ధూళిపాళ్ల రాజేష్, మమ్మనేని రాజా, బొబ్బూరి సంతోషమ్మ, బొబ్బూరి ప్రసాద్, చోడదాసి హరి, బావరాజు నాని, గల్లా రవి.స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# విజయవాడ ఉత్సవ్2.0 ప్రమోషన్‌లో యువత జోష్

## ఫ్లాష్‌మాబ్‌లతో మార్మోగిన పీవీపీ మాల్.. ఉత్సవ్‌పై విస్తృత ప్రచారం



**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** విజయవాడ ఉత్సవ్2.0కు విస్తృత ప్రచారం కల్పించేందుకు నిర్వహిస్తున్న ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా నగర యువత ఉత్సాహంగా పాల్గొంటోంది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పీవీపీ మాల్‌లో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ కార్యక్రమం సందడి వాతావరణాన్ని నెలకొల్పింది. యువత చేసిన ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. విజయవాడ సంస్కృతి, కళలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో విజయవాడ ఉత్సవ్2.0ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ్‌లో యువతను భాగస్వాములను చేయడంతో పాటు, నగర ప్రజల్లో ఉత్సవ్‌పై మరింత ఆసక్తి, ఉత్సాహాన్ని పెంచేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫ్లాష్‌మాబ్ సందర్భంగా యువత ప్రదర్శించిన నృత్యాలు పీవీపీ మాల్‌కు వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతతో పాటు చిన్నారులు, కుటుంబ సభ్యులు సైతం ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఫ్లాష్‌మాబ్ ద్వారా విజయవాడ ఉత్సవ్2.0 ప్రత్యేకతలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతి ఒక్కరూ ఉత్సవ్‌లో భాగస్వాములు కావాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్ పాల్గొని యువత ఉత్సాహాన్ని అభినందించారు. విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని, నగర సంస్కృతి, కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్2.0ను ప్రజలందరి ఉత్సవంగా నిర్వహిస్తున్నామని, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ కరీముల్లా, సంజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు



# రహదారులపై గుంతలు తవ్వితే కఠిన చర్యలు

**శుభకార్యాల్లో కాంక్రీట్ స్టాండ్లనే వాడాలి**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో వివాహాలు, నిశ్చితార్థాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేసేటప్పుడు రహదారులకు నష్టం కలగకుండా కాంక్రీట్ స్టాండ్లను మాత్రమే ఉపయోగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. రహదారులపై గుంతలు తవ్వడం, మేకులు కొట్టడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా అవసరాల కోసం నిర్మించిన రహదారులను శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల పేరుతో దెబ్బతీయడం సరికాదన్నారు. షామియానాల ఏర్పాటుకు రహదారులకు నష్టం కలగని ప్రత్యామ్నాయ పద్ధతులను మాత్రమే వినియోగించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్స్ చట్టం, 1994 ప్రకారం జరిమానాలు విధిస్తామని తెలిపారు. రహదారులకు నష్టం కలిగించే కార్యక్రమాలను అడ్డుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు.

# వైస్సార్సీపీ కార్యకర్తలకు ఐడి కార్డ్స్ పంపిణి చేసిన కోడుమూరు వైస్సార్సీపీ నాయకులు మద్దిలేటి



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి యస్ ఈ సి సభ్యులు మాజీ కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం 04/10/2026న 51వార్డు గీతాముఖర్జీ నగర్ ఇన్చార్జి విక్రమ్ సింహ రెడ్డి , మరియు వై.మద్దిలేటి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల గురించి గురించి సమావేశమై అలాగే వైఎస్ఆర్సిపి ఐడి కార్డ్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మహేంద్ర గౌడ్, సద్దాం, రాఘవేంద్ర, శ్రీకాంత్,అమన్, మహబూబ్, ఫైరోస్, రవి, శేఖర్, మరియు ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేస్తాం

**శిరివెళ్లలో భూమా జగత్ విక్యాత్ రెడ్డి కి ఘన స్వాగతం**

**వైసీపీని వీడి టిడిపిలో చేరిన 40 కుటుంబాలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన భూమా**



**శిరివెళ్ల :-(నంది పత్రిక)** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని కార్యకర్తలకు అండదండగా ఉంటూ వారి గెలుపే ధ్యేయంగా కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ యువ నేత భూమ జగత్ విఖ్యాత్ రెడ్డి పేర్కొన్నారు ఆదివారం సిరివెళ్ల మండల కేంద్రానికి వచ్చిన భూమా జగత్ విఖ్యాత రెడ్డికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. డిజె సౌండ్ మ్యూజిక్ మూతలతో బాణసంచా పేలుళ్లతో డప్పు వాయిద్యాల మధ్య పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ప్రధాన రహదారి నుండి జండా పేట వరకు పాదయాత్రగా వెళ్లి వైసీపీ నుండి టిడిపిలో చేరిన వారిని భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.నేడు పాతూరు లతీఫ్ సార్ ఫ్యామిలీ అయినటువంటి రెడ్డి రఊఫ్ వారి ఫ్యామిలీ, మక్బుల్ వారి ఫ్యామిలీ, ఎం షరీఫ్ వారి ఫ్యామిలీలతో పాటు మరో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం శుభసూచకం అని భూమా విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అయినా ఎంపీటీసీ జడ్పిటిసి సర్పంచ్ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల వలె కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి సిరివెళ్ల టిడిపి యువనేత బిసి ఫీదా హుస్సేన్, బి ఎం డి రఫీ, మాజీ జెడ్పిటిసి యామ గుర్రప్ప, సూర రామ,కొత్తపేట జిక్రియా బ్రదర్స్, నంద్యాల అబూబకర్ సిద్దిక్ టిడిపి వారియర్స్ సభ్యులు ఉల్లి వెంకటసుబ్బయ్య, ఉల్లి ప్రసాద్, అల్లా భకాష్, సినిమా హాలు కరీం యునుస్ గేట్ షేక్ష గంగ దాసరి లక్ష్మిరెడ్డి గంగాధర శ్రీ శ్రీనివాసరెడ్డి సిరివెళ్ల సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి నీటి సంఘం చైర్మన్ కమతం లక్ష్మిరెడ్డి మాజీ ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి గంగ దాసరి రవిచంద్ర రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు భూమా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం.



**సిరివెళ్ల (నంది పత్రిక)** పల్లె ప్రగతికి ప్రాధాన్యం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నంద్యాల పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ పేర్కొన్నారు. కోటపాడు గ్రామంలోని పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూత సిసి రహదారి నిర్మాణ పనులు భూమి పూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా శకుంతలమ్మ మాట్లా డుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పన కృషి చేస్తామన్నారు. నీటి సంఘం ఉపాధ్యక్షులు బుసిరెడ్డి టిడిపి నాయకులు శేష ఓబుల్ రెడ్డి ఆదివారం నాడు నూతన సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

## ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా తెనాలిలో పర్యటించిన

# కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు





బుర్రిపాలెంలో జానకీరామ్ అనే రైతుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి ఎలాంటి రసాయనాలు, ఎరువులు వాడకుండా సాగు చేస్తున్న రైతు జానకీ రామ్‌ను భుజం తట్టి అభినందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్జానకీరామ్ అవలంభిస్తున్న సాగు పద్దతులు, సాగు ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్న శివరాజ్ సింగ్ చౌహాన్, చంద్రబాబుప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబు... రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలిపారంటూ అభినందించిన కేంద్ర మంత్రి శివరాజ సింగ్ చౌహాన్వ్యవసాయ క్షేత్ర సందర్శన సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. 50 లక్షల ఎకరాల్లో ప్రకృతిసాగు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.ఎలాంటి ఎరువులు, కెమికల్స్ వాడకుండా ప్రకృతి సాగు చేయడం చాలా ఆనందాన్నిస్తోందిబీజామృతం.. జీవామృతాలతో సాగు చేస్తున్నారు.ప్రకృతి సాగులో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్నారు ప్రధాని లక్ష్యాలకు అనుగుణంగా ఏపీలో ప్రకృతి సాగు జరుగుతోంది.ప్రకృతిసాగుతో ప్రజారోగ్యం బాగుంటుంది.. భూసారం పెరుగుతుంది.భూసారం బాగుంటే చక్కటి పంట వస్తుంది... చక్కటి పంట వస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.పెద్ద ఎత్తున ప్రకృతి సాగు చేసేలా కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు అభినందనలు.ప్రకృతి సాగుకు చంద్రబాబు ఇస్తున్న ప్రోత్సాహంతో దేశంలో ఏపీ నెంబర్-1 స్థానంలో ఉంది.నేచురల్ ఫార్మింగ్ పద్దతిలో ఎకరా వరి సాగుకు కేవలం రూ.7 వేలు మాత్రమే ఖర్చు అవుతోందని రైతు జానకీ రామ్ చెప్పారు.అదే రసాయన ఎరువులతో సాగు చేస్తే ఎకరాకు రూ. 25 వేలు ఖర్చు అవుతుంది. పెద్ద ఎత్తున సాగు ఖర్చులు తగ్గుతున్నాయి... దీని వల్ల రైతుకు మేలు జరుగుతుంది.ప్రకృతి సాగుతో పండించిన ఉత్పత్తికి మార్కెట్టులో కూడా చక్కటి ధర లభిస్తోంది. అంతకముందు బుర్రిపాలెంలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళు లర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 4**
**నంది పత్రిక స్పెషల్**



# దెందులూరులో వైసీపీకి కోలుకోలేని దెబ్బ





**- మసీదుపాడులో ఎమ్మెల్యే చింతమనేని సమక్షంలో భారీగా టీడీపీలోకి చేరికలు**

**- వైసీపీ కంచుకోట బద్దలు.. కూటమి ప్రభుత్వ అభివృద్ధి పాలనకు ఆకర్షితులై టీడీపీ తీర్థం పుచ్చుకున్న 25 కుటుంబాలు**

**- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్**

**- ప్రజా సంక్షేమ పాలనను మెచ్చి స్వచ్ఛందంగా చేరడం శుభపరిణామం: ఎమ్మెల్యే చింతమనేని**

**- మసీదుపాడు అభివృద్ధికి ఎమ్మెల్యే చింతమనేని భరోసా**

**దెందులూరు బ్యూరో చీఫ్ అక్టోబర్ 4 నంది పత్రిక** దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై, అహర్నిశలు తన నియోజకవర్గ ప్రజల కోసమే శ్రమించే దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసంతో దెందులూరు మండలం మసీదుపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయిలి. ఆదివారం మసీదుపాడు గ్రామంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలకు ఆయన స్వయంగా పసుపు కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారులి. అంతకుముందు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే చింతమనేని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతా సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో లిఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీకి, ఆ తర్వాత వైసీపీకి మసీదుపాడు ఒక కంచుకోటగా ఉండేదని, అలాంటి గ్రామంలో ఎలాంటి ఎన్నికల వాతావరణం లేనప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా కూటమి ప్రభుత్వ అభివృద్ధిని మెచ్చి టీడీపీ జెండా పట్టడం ఎంతో శుభపరిణామమని కొనియాడారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఇంటి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అన్ని విధాలా కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.గ్రామంలో గతంలో తారురోడ్డు వేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మసీదుపాడు నుంచి అలుగులగూడెం మీదుగా మెయిన్ రోడ్డును కలుపుతూ రూపుదిద్దుకునేలా నూతన తారురోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించి, గ్రామానికి సమగ్ర రవాణా సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గ్రామంలోని సమస్యలను గుర్తించాలని, మసీదుపాడు రూపురేఖలు మార్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చేరిన ప్రతి ఒక్కరి ఆర్థిక, సామాజిక వివరాలు సేకరించి ప్రభుత్వ పథకాల ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కసుకుర్తి రామకృష్ణ, జోగన్నపాలెం సొసైటీ చైర్మన్ డాక్టర్ పసుమర్తి మధు, గాలాయగూడెం సొసైటీ చైర్మన్ పూజారి వెంకటరత్నం నాయుడు, కో- క్లస్టరు ఇంచార్జ్ మారగాని సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు చింతా సుబ్బారావు, యూనిట్ ఇంచార్జ్ కొయ్యూరి గంగరాజు, కూటమి నాయకులు ఏనుగు. రామక్రిష్ణ, కొడాలి.ఆంజనేయులు, మాగంటి గిరి, వెలివెల నాగరాజు, ఏనుగు ఆచారావు, కొండేటి శ్రీనివాస్, దొండా శ్రీనివాస్, కొండేటి హనుమంత్, తోట రామక్రిష్ణ, డి.బాలగోపాల్, శ్రీధర్ సహా పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు నూతనంగా పార్టీలో చేరిన కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## షైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి.. అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు

**అమెరికా, ఇజ్రాయెల్ విమానాలపై దాడులకు అల్ ఖైదా మద్దతుదారుల పిలుపు**

**ఇటీవలి షైదుబాయ్ హైజాక్ యత్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచన**

**9/11 దాడులను గుర్తుచేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కథనం**

**'అల్ బయాన్' అనే వారపత్రికలో ఈ మేరకు పిలుపునిచ్చిన ఉగ్రవాదులు**

అంతర్జాతీయంగా మరోసారి ఉగ్రవాద దాడుల కలకలం రేగింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై దాడులు చేయాలంటూ అల్ ఖైదా మద్దతుదారులు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన షైదుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని, 2001 సెప్టెంబర్ 11 దాడులను స్ఫూర్తిగా తీసుకుని 'కాపీక్యాట్ దాడులు' (అచ్చం అలాంటి దాడులే) చేయాలని తమ పత్రిక ముఖంగా రెచ్చగొట్టారు. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేసింది.అల్ ఖైదా మద్దతుతో నడుస్తున్న 'అల్ బయాన్' అనే అరబిక్ వారపత్రిక ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. "యుద్ధం ఇంకా ముగియలేదు. జియోనిస్టులు, అమెరికన్లు, ఇస్లాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర అవిశ్వాసులను మోసుకెళ్లే విమానాలు ఇంకా ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 11, సెప్టెంబర్ 30న జరిగినట్లుగా వాటిని లక్ష్యంగా చేసుకోవచ్చు" అని ఆ కథనంలో పేర్కొన్నారు. 9/11, షైదుబాయ్ ఘటనలకు సంబంధించిన చిత్రాలను కూడా దీనికి జోడించారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న షైదుబాయ్ విమానాన్ని నేలకూల్చేందుకు విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ విమాన కో-పైలట్, కాక్‌పిట్‌లోని గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో విమానం వేగంగా కిందకు దూసుకెళ్లి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ హైజాక్ యత్నానికి పాల్పడిన కో-పైలట్ ఒమన్‌కు చెందినవాడని, అతనికి తీవ్రవాద భావజాలం ఉందన్న కారణంతో గతంలోనే ఒమన్ అధికారులు విమానాలు నడపకుండా నిషేధం విధించారని దర్యాప్తులో తేలింది.

## జైరాం.. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు: నిర్మలా సీతారామన్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. "జైరాం, నమ్మలేకపోతున్నాను. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయటకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు. అక్కడ జరిగింది అంతే" అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే..** ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు.అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు. జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

# ఇక్కడా... అక్కడా ఒకటి మిస్!

రాజకీయ ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టడంలో తెలంగాణ సీఎం చూపిస్తున్న తెగువను ఏపీ సీఎం చంద్రబాబు ఒంటబట్టించుకోవాలని తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు భావిస్తూ ఉండగా.. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని వెళ్లడంలో చంద్రబాబును చూసి తమ సీఎం రేవంత్ నేర్చుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. రేవంత్‌లో అంతులేని తెగువ ఉంది. రాజకీయ రణ క్షేత్రంలో ప్రత్యర్థులను మాటలతో చీల్చి చెండాడడంలో మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన ఏ మాత్రం తీసిపోరు. అధికారంలో ఉండి కూడా ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడవేయగల నేర్పరితనం రేవంత్ సొంతం. అయితే పార్టీలో అందరినీ కలుపుకొని వెళ్లడంలో మాత్రం ఆయనకు మైనస్ మార్కులే వేయాల్సి ఉంటుంది.ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడల్లా రేవంత్ అఫెన్స్ మార్గాన్ని ఎంచుకుంటారు. రాజకీయాల్లోనే కాదు ఏ అంశంలోనైనా డిఫెన్స్‌లో ఉండటం కన్నా అఫెన్స్‌లో ఉండటమే వాంఛనీయం. తెలంగాణ వనరులను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ప్రజలను నమ్మించే ప్రయత్నం ద్వారా తమ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల నుంచి ఆయన ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో అత్యధికులు రేవంత్ వ్యవహార శైలి పట్ల సంతోషంగా లేని మాట వాస్తవం. ఒకరిద్దరు మినహా మిగతా మంత్రులలో ఏదో తెలియని అసంతృప్తి! ఎమ్మెల్యేలలో కూడా ఇదే పరిస్థితి. రాజకీయ ప్రత్యర్థులను అలవోకగా ఆత్మరక్షణలో పడవేయగలుగుతున్న రేవంత్ ఆయా సందర్భాలలో లౌక్యం కొరవడటం, అందరినీ కలుపుకొని వెళ్లలేక పోవడం వల్ల సొంత పార్టీ వ్యవహారాల్లో ఆత్మరక్షణలో పడుతున్నారు.రాజకీయ గురువు చంద్రబాబుతో పోల్చితే రేవంత్‌లో తెగువ, తెంపరితనం ఎక్కువ. అయితే సహనం విషయంలో మాత్రం రేవంత్ చంద్రబాబుకు సరిరారు. భూదేవికి ఉన్నంత ఓర్పు చంద్రబాబుకు ఉంటుంది. రాజకీయంగా తనను తీవ్రంగా దూషించే వాళ్లను కూడా కలుపుకొని వెళ్లగల నేర్పు, ఓర్పు ఆయన సొంతం.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన రాజకీయాలు మాత్రమే చేస్తారు. రాజకీయమే శ్వాసగా జీవిస్తారు. సంక్షోభాలు ఎదురైనప్పుడు చురుగ్గా వ్యవహరిస్తారు. అధికారంలోకి వచ్చాక ఆయన రాజకీయాలకు ప్రాధాన్యం తగ్గించి ప్రభుత్వ వ్యవహారాల సమీక్షలకే తన సమయమంతా కేటాయిస్తారు. చంద్రబాబులోని ప్రధాన లోపం ఇదే! 'పొరుగింటి పుల్లకూర రుచి' అని అంటారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పనితీరు, వారి వ్యవహార శైలిపై ప్రధాన రాజకీయ పార్టీల అభిమానులు, కార్యకర్తలు వ్యక్తంచేస్తున్న అభిప్రాయాలు వింటున్నప్పుడు ఈ సామెత గుర్తుకువస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మెచ్చుకుంటూ ఉండగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, అభిమానులు కోరుకుంటున్నారు. ఆయా పార్టీల నాయకులు, అభిమానులు తమ అధినేతల విషయంలో ఎందుకు పెదవి విరుస్తున్నారు? అని ప్రశ్నించుకుంటే ఇరువురు ముఖ్యమంత్రులూ తమ శ్రేణుల అభిమతానికి అనుగుణంగా వ్యవహరించడం లేదని భావించవలసి ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థులను ఆత్మరక్షణలోకి నెట్టడంలో తెలంగాణ ముఖ్యమంత్రి చూపిస్తున్న తెగువను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటబట్టించుకోవాలని తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు భావిస్తూ ఉండగా.. నాయకులు, కార్యకర్తలను కలుపుకొనివెళ్లడంలో చంద్రబాబును చూసి తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కోరుకుంటున్నారు. నిజానికి ఇరువురు ముఖ్యమంత్రులలో ఎవరి బలాలు, ఎవరి బలహీనతలు వారికి ఉన్నాయి. ముందుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విషయానికి వద్దాం. రేవంత్‌రెడ్డిలో అంతులేని తెగువ ఉంది. రాజకీయ రణ క్షేత్రంలో ప్రత్యర్థులను మాటలతో చీల్చి చెండాడడంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన ఏ మాత్రం తీసిపోరు. అధికారంలో ఉండి కూడా ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడవేయగల నేర్పరితనం రేవంత్‌రెడ్డి సొంతం. అయితే పార్టీలో అందరినీ కలుపుకొని వెళ్లడంలో మాత్రం ఆయనకు మైనస్ మార్కులే వేయాల్సి ఉంటుంది. తెలంగాణలో 22ఏ పేరిట ప్రైవేటు భూములు, ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారన్న విమర్శలు జోరందుకున్న తరుణంలో కేసీఆర్ కుటుంబీకుల భూముల వివరాలు వెల్లడించి ప్రత్యర్థులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి కల్పించారు. శాసనసభలో ఆయన ప్రతిపక్షాన్ని ఒంటిచేత్తో ఆత్మరక్షణలోకి నెట్టారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ అభిమానులు, నాయకులు ఫిదా అయిపోయారు. ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఎదురైనప్పుడల్లా రేవంత్‌రెడ్డి అఫెన్స్ మార్గాన్ని ఎంచుకుంటారు. రాజకీయాల్లోనే కాదు ఏ అంశంలోనైనా డిఫెన్స్‌లో ఉండటం కన్నా అఫెన్స్‌లో ఉండటమే వాంఛనీయం. ఈ ఫార్ములాను రేవంత్‌రెడ్డి తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడచిన సందర్భంలో అధికార పార్టీపై సహజంగానే ఆరోపణలు కమ్ముకుంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలకు కొదవలేదు. అయితే సదరు ఆరోపణల కంటే కేసీఆర్ కుటుంబంపై రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలకే అధిక ప్రాచుర్యం లభిస్తోంది. తెలంగాణ వనరులను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ప్రజలను నమ్మించే ప్రయత్నం ద్వారా తమ ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణల నుంచి ఆయన ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీ దగ్గర కేటీఆర్‌కు స్టార్ హోటళ్లు ఉన్నాయని ముఖ్యమంత్రి తాజాగా ఆరోపించారు. 'అవును2006లో నేను ప్రారంభించిన హోటల్ ఇప్పుడు మూడు హోటళ్లుగా విస్తరించింది' అని కేటీఆర్ చెప్పుకోవలసి వచ్చింది. అంతకుముందు భూముల విషయంలో కూడా ఇదే జరిగింది. రాజకీయాల్లో ఎదురు దాడి అనే ఎత్తుగడను ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మొదలెట్టారు. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ కూడా ఇదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఆరోపణలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రత్యర్థులను వారి సొంత నియోజకవర్గాలకే పరిమితం చేసే ఎత్తుగడలను కూడా రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్నారు. బహుశా ఆయన ఈ ఎత్తుగడను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నుంచి కాపీ కొట్టినట్టు ఉన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంపై ఫోకస్ పెట్టారు. దీంతో నియోజకవర్గంలో పట్టు జారిపోకుండా కాపాడుకోవాల్సిన పరిస్థితి చంద్రబాబుకు ఎదురైంది. కుప్పంలో స్వేచ్ఛగా తిరగడానికి కూడా అప్పట్లో చంద్రబాబు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే వ్యూహాన్ని బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల, సిద్దిపేటల్లో అమలుకు పూనుకున్నారు. నిజానికి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌పై దృష్టి కేంద్రీకరించి 2018 ఎన్నికల్లో ఓడించారు. ఈ కారణంగానే రేవంత్‌రెడ్డి ఆ తర్వాత మల్కాజ్‌గిరి నుంచి ఎంపీ సీటుకు పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు కేసీఆర్‌జగన్ బాటలో తన రాజకీయ ప్రత్యర్థులను వారి సొంత నియోజకవర్గాలకే పరిమితం చేసే పనిలో రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఈ కారణంగానే ఆయన సిరిసిల్లలో భారీ ర్యాలీ నిర్వహించి బహిరంగసభలో ప్రసంగించారు. వర్తమాన రాజకీయాలలో నెట్టుకురావాలంటే ఏ రాజకీయ నాయకుడైనా ఇదే విధంగా వ్యవహరించాలి. ఈ కారణంగానే రేవంత్‌రెడ్డి పోకడలను, రాజకీయ ఎత్తుగడలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం నాయకులు, శ్రేణులు అభినందిస్తున్నాయి. పొరుగు రాష్ట్రానికి చెందిన వారి అభినందనలు అందుకుంటున్న రేవంత్‌రెడ్డి, సొంత రాష్ట్రంలో సొంత పార్టీ శ్రేణులు, నాయకుల అభినందనలు అందుకోలేకపోవడానికి కారణం ఏమిటి? కాంగ్రెస్ పార్టీలో అత్యధికులు రేవంత్‌రెడ్డి వ్యవహార శైలి పట్ల సంతోషంగా లేని మాట వాస్తవం. ఒకరిద్దరు మినహా మిగతా మంత్రులలో ఏదో తెలియని అసంతృప్తి! ఎమ్మెల్యేలలో కూడా ఇదే పరిస్థితి. ఈ పరిస్థితికి కారణం ఏమిటి? అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించగా ముఖ్యమంత్రి అందరినీ కలుపుకొని వెళ్లడం లేదని, నిర్ణయాలు తీసుకునే ముందు ఎవరినీ సంప్రదించడం లేదని చెబుతున్నారు. ఉదాహరణకు.. రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను తాజాగా ప్రకటించారు. ఈ అభ్యర్థులలో ఒకరు నల్లగొండ జిల్లాకు చెందిన వ్యక్తి. అయినా అభ్యర్థిని ప్రకటించే ముందు ముఖ్యమంత్రి తమతో మాట మాత్రమైనా చెప్పకపోవడం ఏమిటి? అని నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు కినుక వహించారు. ఆ మంత్రుల ఆవేదనలో అర్థం ఉంది. అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ అధిష్ఠానమే ఖరారు చేసి ఉండవచ్చును గానీ పేర్లు ప్రకటించే ముందు, లేదా పేర్లు ప్రతిపాదించే సమయంలో సంబంధిత జిల్లా మంత్రులను సంప్రదించడం అభిలషణీయం. ఇలాంటి అంశాలలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రాంతీయ పార్టీలో వలె కాంగ్రెస్ పార్టీలో ప్రైవేట్ లిమిటెడ్ సంస్కృతి కుదరదు. తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ అభ్యర్థుల ఎంపిక సమయంలో చంద్రబాబు నాయుడు అందరినీ సంప్రదించడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి అంశాలలో చంద్రబాబును చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. ఈ కారణంగానే రేవంత్‌రెడ్డి పలు సందర్భాలలో ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. ముఖ్యమంత్రి తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడుతున్నది కూడా కొద్ది మందే. రాజకీయ ప్రత్యర్థులను అలవోకగా ఆత్మరక్షణలో పడవేయగలుగుతున్న రేవంత్‌రెడ్డి ఆయా సందర్భాలలో లౌక్యం కొరవడటం, అందరినీ కలుపుకొని వెళ్లలేకపోవడం వల్ల సొంత పార్టీ వ్యవహారాల్లో ఆత్మరక్షణలో పడుతున్నారు. రాజకీయ గురువు చంద్రబాబుతో పోల్చితే రేవంత్‌రెడ్డిలో తెగువ, తెంపరితనం ఎక్కువ. ఈ లక్షణాలే కలిసొచ్చి ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అయితే సహనం విషయంలో మాత్రం రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు సరిరారు. భూదేవికి ఉన్నంత ఓర్పు చంద్రబాబుకు ఉంటుంది. రాజకీయంగా తనను తీవ్రంగా దూషించే వాళ్లను కూడా కలుపుకొని వెళ్లగల నేర్పు, ఓర్పు ఆయన సొంతం. ఈ అంశంలో రేవంత్‌రెడ్డి సొంత పార్టీ వాళ్ల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయానికి వద్దాం. ఆయన వ్యవహార శైలిపై సొంత పార్టీ నేతలు ఎందుకు పెదవి విరుస్తున్నారు? ముఖ్యమంత్రిగా ఆయనపై ప్రజల్లో అసంతృప్తి ఉందో లేదో తెలియదు గానీ తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మాత్రం అసంతృప్తి ఉందని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిస్థితికి కారణాలు లేకపోలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు రాజకీయాలు వేరు.. అధికారంలో ఉన్నప్పుడు చేసే రాజకీయాలు వేరేగా ఉంటాయి.

# బిజినెస్

## భారత స్టాక్ మార్కెట్‌కు షాక్.. సెప్టెంబర్‌లో రూ.35,860 కోట్లు వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు..




ఇటీవలి కాలంలో దేశీయ స్టాక్ మార్కెట్ భారీ నష్టాలను చవిచూస్తోంది. దానికి ప్రధాన కారణం విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు విపరీతంగా పెరగడమే. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (FPI) సెప్టెంబర్‌లో భారత ఈక్విటీల నుంచి నికరంగా రూ. 35,860 కోట్లను ఉపసంహరించుకున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో భారీగా పెట్టుబడులు పెట్టిన విదేశీ మదుపర్లు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడం మార్కెట్‌పై ఒత్తిడిని పెంచింది విదేశీ పెట్టుబడిదారులు భారత ఈక్విటీల్లో జూలైలో సుమారు రూ. 20,200 కోట్లు, ఆగస్టులో రూ. 29,631 కోట్లు పెట్టుబడి పెట్టారు. అయితే సెప్టెంబర్‌లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఏకంగా రూ.35 వేల కోట్లకు పైగా ఉపసంహరించుకున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు, అధిక చమురు ధరలు, అమెరికా బాండ్ రాబడులు పెరగడం, రూపాయి బలహీనపడటం వంటి అంశాలు భారత మార్కెట్ నుంచి విదేశీ నిధుల ఉపసంహరణకు కారణమయ్యాయి . అమెరికా బాండ్లపై రాబడులు పెరిగినప్పుడు విదేశీ ఇన్వెస్టర్లకు డాలర్ ఆధారిత ఆస్తులు మరింత ఆకర్షణీయంగా మారతాయి. దీంతో అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి నిధులు బయటకు వెళ్లే అవకాశం పెరుగుతుంది. అలాగే చమురు ధరలు భారత మార్కెట్‌కు మరో పెద్ద సమస్యగా మారాయి. భారత్ భారీగా ముడి చమురును దిగుమతి చేసుకునే దేశం. అధిక చమురు ధరలు దిగుమతి బిల్లును పెంచుతాయి. అదే సమయంలో ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్‌పై ఒత్తిడి పెరిగే అవకాశాలు ఉంటాయి .

## ఆన్‌లైన్ సేల్స్‌లో 60% ఆఫర్.. అసలు నిజమా? డార్క్ ప్యాటర్న్ మోసమా?



పండగ సీజన్ వచ్చిందంటే చాలు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు భారీ ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తుంటాయి. 60శాతం, 70శాతం డిస్కౌంట్ అంటూ ఊరించే ప్రకటనలు చూసి చాలామంది షాపింగ్‌కు సిద్ధమవుతారు. అయితే, ఈ ఆఫర్ల వెనుక 'డార్క్ ప్యాటర్న్స్' అని పిలిచే ఒకరకమైన మోసపూరిత డిజైన్ పద్ధతులు ఉన్నాయని, ఇవి మన కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటి గురించి తెలుసుకోకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది.

### -ఏమిటీ డార్క్ ప్యాటర్న్స్?

డార్క్ ప్యాటర్న్స్ అంటే వినియోగదారులను మానసికంగా ప్రభావితం చేసి, వారు అనుకోని వస్తువులను కొనేలా లేదా ఎక్కువ డబ్బు ఖర్చు చేసేలా ప్రేరేపించే డిజైన్ టెక్నిక్స్. ఉదాహరణకు, 'కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయి' లేదా 'ఆఫర్ మరికొద్ది సేపట్లో ముగుస్తుంది' అంటూ కౌంట్‌డౌన్ టైమర్లు పెట్టి మనలో ఆతృతను పెంచుతారు. దీనివల్ల ఆలోచించకుండా వెంటనే కొనేస్తాం. అలాగే, ఒక వస్తువు అసలు ధరను కృత్రిమంగా పెంచి, దానిపై అధిక డిస్కౌంట్ ఇస్తున్నట్లు చూపడం కూడా ఇందులో భాగమే. చాలా సందర్భాల్లో, మనం వస్తువులను కార్ట్‌లో యాడ్ చేశాక, మనకు తెలియకుండానే అదనపు యాడ్-ఆన్‌లు లేదా వారంటీలు చేరిపోతాయి. చివరికి చెక్-అవుట్ దశలో డెలివరీ లేదా ప్యాకేజింగ్ పేరుతో అదనపు ఛార్జీలు ప్రత్యక్షమవుతాయి. ఇవన్నీ డార్క్ ప్యాటర్న్స్‌లో భాగమే.

### -భారీ నష్టం.. ప్రభుత్వ చర్యలు

ఈ డార్క్ ప్యాటర్న్స్ కారణంగా భారతీయ వినియోగదారులు ఏటా సుమారు రూ.25,000 కోట్ల నుంచి రూ.28,000 కోట్ల వరకు నష్టపోతున్నారని డేటమ్ ఇంటెలిజెన్స్ సంస్థ 2026లో జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ఆసక్తికరంగా, 81శాతం మంది వినియోగదారులకు ఇలాంటి మోసాల గురించి అవగాహన ఉన్నప్పటికీ, 85శాతం మంది తాము ఏదో ఒక సందర్భంలో మోసపోయామని అంగీకరించారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ), మొత్తం 13 రకాల డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనికి కొనసాగింపుగా, ప్రభుత్వం ఈ-కామర్స్ నిబంధనలను సవరించింది. 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఒక వస్తువుకు గత 30 రోజుల్లో ఉన్న అత్యల్ప ధరను తప్పనిసరిగా ప్రదర్శించాలి. డిస్కౌంట్లు, ఇతర ఛార్జీల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలి. ఇప్పటికే కొన్ని ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు ఈ నిబంధనలను పాటిస్తామని స్వీయ-ధృవీకరణ పత్రాలు సమర్పించాయి.

### -వినియోగదారులు ఏం చేయాలి?

ఈ ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ఏదైనా వస్తువును కొనే ముందు, దాని ధర గత కొన్ని రోజులుగా ఎలా ఉందో తనిఖీ చేయాలి. ఇందుకోసం ప్రైస్ హిస్టరీ ట్రాకింగ్ వెబ్‌సైట్లను ఉపయోగించుకోవచ్చు. ఒకే వస్తువును వేర్వేరు ప్లాట్‌ఫామ్‌లలో పోల్చి చూసి, తుది చెల్లింపు మొత్తం ఎక్కడ తక్కువగా ఉందో నిర్ధారించుకోవాలి. పేమెంట్ చేసే ముందు కార్ట్‌ను ఒకటికి రెండుసార్లు సమీక్షించి, అనవసరమైన యాడ్-ఆన్‌లు ఏమైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఆతృత కలిగించే సందేశాలను చూసి కంగా రుపడి నిర్ణయాలు తీసుకోవద్దు. ఒకవేళ మోసపోయినట్లు భావిస్తే, ఉత్పత్తి లిస్టింగ్ స్క్రీన్‌షాట్‌లను ఆధారంగా తీసుకుని జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

# స్పోర్ట్స్

## ఇరానీ కప్ రెస్టాఫ్ ఇండియా కైవసం.. ముఖేష్ కుమార్ దెబ్బకు జమ్మూ కశ్మీర్ చిత్తు



ఫాస్ట్ బౌలర్ ముఖేష్ కుమార్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో రెచ్చిపోవడంతో రెస్టాఫ్ ఇండియా జట్టు 31వ సారి ఇరానీ కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. షేర్-ఇ-కశ్మీర్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో రంజీ ట్రోఫీ ఛాంపియన్ జమ్మూ కశ్మీర్‌ను 167 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. ఆదివారం, నాలుగో రోజు 279 పరుగుల లక్ష్య ఛేదనలో జమ్మూ కశ్మీర్ జట్టు పేకమేడలా కుప్పకూలింది. లంచ్ విరామానికి 89/3 స్కోరుతో పటిష్ఠంగానే కనిపించిన జమ్మూ కశ్మీర్, విరామం తర్వాత గంట వ్యవధిలోనే చేతులెత్తేసింది. ముఖ్యంగా ముఖేష్ కుమార్ తన అద్భుతమైన స్పెల్‌తో ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కేవలం 33 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 11వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఒకే ఓవర్‌లో నాలుగు బంతుల వ్యవధిలో మూడు వికెట్లు తీసి జమ్మూ కశ్మీర్ మిడిలార్డర్ వెన్ను విరిచాడు. అతనికి ఆకాశ్ దీప్ (3/25) చక్కటి సహకారం అందించాడు. మరో పేసర్ ముఖేష్ చౌదరి కీలకమైన అబ్దుల్ సమద్ వికెట్‌ను తీశాడు. దీంతో కశ్మీర్ జట్టు 28.4 ఓవర్లలో కేవలం 111 పరుగులకే ఆలౌటైంది. ఆ జట్టులో శుభమ్ ఖజురియా (36), కమ్రాన్ ఇక్బాల్ (32), అబ్దుల్ సమద్ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అంతకుముందు, రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేయగా, జమ్మూ కశ్మీర్ 278 పరుగులు చేసి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో స్మరణ్ రవిచంద్రన్ (135) అద్భుత సెంచరీతో రెస్టాఫ్ ఇండియా 319 పరుగులు చేసి తిరిగి పోటీలోకి వచ్చింది. స్మరణ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ 68 పరుగులతో రాణించడంతో అతనికి "ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్" అవార్డు లభించింది. జ్వరంతో బాధపడుతున్న రెగ్యులర్ కెప్టెన్ రిషభ్ పంత్ డగౌట్‌కే పరిమితం కాగా, అతని స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ కెప్టెన్‌గా జట్టును విజయపథంలో నడిపించాడు. పంత్ పుట్టినరోజున ఈ విజయం అతనికి మంచి బహుమతిగా నిలిచింది. కాగా, రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 20కి పైగా నో-బాల్స్ వేయడం జమ్మూ కశ్మీర్ ఓటమికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది.

## ఆసియా క్రీడల్లో భారత్ చరిత్రాత్మక ప్రదర్శన.. ఈసారి సాధించిన విజయాలు సమ్‌థింగ్ స్పెషల్!



జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా జరిగిన 2026 ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు చరిత్రాత్మక ప్రదర్శనతో అదరగొట్టారు. మొత్తం 85 పతకాలు సాధించి, పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచారు. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి. గత ప్రదర్శనను పునరావృతం చేస్తూ నాలుగో ర్యాంకును నిలబెట్టుకున్నప్పటికీ, ఈసారి విజయాలు మాత్రం అనేక క్రీడాంశాల్లో సరికొత్త చరిత్రను లిఖించాయి. 2023 హాంగ్‌జౌ క్రీడల తర్వాత భారత్‌కు ఇదే రెండో అత్యుత్తమ పతకాల ప్రదర్శన కావడం విశేషం.

### -మహిళల హాకీకి 44 ఏళ్ల తర్వాత స్వర్ణం

ఈ క్రీడల్లో భారత హాకీ జట్ల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఏకంగా 44 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత మహిళల హాకీ జట్టు స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. మరోవైపు, పురుషుల జట్టు తమ టైటిల్‌ను విజయవంతంగా నిలబెట్టుకుంది. ఒకే ఆసియా క్రీడల్లో పురుష, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. ఇదే స్ఫూర్తితో క్రికెట్‌లోనూ భారత జట్లు సత్తా చాటాయి. పురుషుల, మహిళల విభాగాల్లో రెండు జట్లూ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని క్లీన్‌స్వీప్ చేశాయి. ఆర్చరీ, గోల్ఫ్‌లో కొత్త చరిత్ర వ్యక్తిగత విభాగాల్లోనూ భారత క్రీడాకారులు అద్భుతాలు చేశారు. 17 ఏళ్ల యువ ఆర్చర్ కుంకుమ్ మోహోద్ వ్యక్తిగత రికర్వ్ విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించింది. మహిళల రికర్వ్ జట్టు కూడా స్వర్ణం గెలిచి, ఈ విభాగంలో దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న దక్షిణ కొరియాకు గట్టి షాక్ ఇచ్చింది.

## ఈ స్వర్ణం తేలిగ్గా రాలేదు.. వారి అనుభవమే మా విజయానికి కారణమైంది: సంజూ శాంసన్





ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో భారత జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే, ఈ స్వర్ణం తమకు సులభంగా దక్కలేదని, దీనికోసం తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందని భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నాడు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో కూడిన 'ఏ' టీమ్‌ను బరిలోకి దించడం వల్లే పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించగలిగామని స్పష్టం చేశాడు. ఈ విజయం అనంతరం సంజూ శాంసన్ మాట్లాడుతూ.. "మాది చాలా అనుభవజ్ఞులైన జట్టు. ప్రాక్టీస్, మ్యాచ్‌లు లేనప్పుడు కూడా మమ్మల్ని మేము ఎలా ప్రేరేపించుకోవాలో, శక్తిని ఎలా కాపాడుకోవాలో మాకు తెలుసు. ఆసియా క్రీడలకు 'ఏ' టీమ్‌ను తీసుకురావడం నిజంగా కలిసి వచ్చింది. పాకిస్థాన్‌తో ఫైనల్‌లో అదే జరిగింది. అందరికీ ఇది ఒక సరైన మ్యాచ్‌లా అనిపించింది" అని వివరించాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ అద్భుత అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 211 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ కూడా గట్టిగానే పోరాడింది. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై దూకుడుగా ఆడి, చివరి వరకు మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చింది. అయితే, భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో పాకిస్థాన్ 6 వికెట్లు కోల్పోయి 192 పరుగులకే పరిమితమైంది. "చివరకు ఒక మంచి మ్యాచ్ ఆడే అవకాశం లభించింది. మేం 200 పరుగులు చేశాక పాకిస్థాన్‌కు ఛేజింగ్ కష్టమవుతుందని అనుకున్నాం. కానీ, వికెట్ బాగుండటంతో వాళ్లు కూడా బాగా ఆడారు. ప్రేక్షకులకు ఒక మంచి ఫైనల్ చూసే అవకాశం దక్కింది. ఈ స్వర్ణం మాకు సులభంగా దక్కలేదు. కష్టపడి సాధించాం కాబట్టే ఎక్కువ సంతృప్తినిచ్చింది. మేమంతా చాలా సంతోషంగా ఉన్నాం" అని సంజూ పేర్కొన్నాడు. ఆసియా క్రీడల ఫైనల్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప అవకాశమని, అయితే ఆట ప్రారంభమయ్యాక పరిస్థితులకు అనుగుణంగానే ఆడామని, ఒత్తిడిని దరిచేరనీయలేదని సంజూ స్పష్టం చేశాడు.

# కామన్ పాస్ బాగుంది.. ధరలే భారం

**-పెదవి విరుస్తున్న ప్రయాణికులు**
**-అలా అయితే నష్టపోతామని వాదన**

మెట్రో రైలు, ఆర్టీసీ సేవలను కలిపి ప్రయాణించే వారికి సౌకర్యంగా ఉండేలా అందుబాటులోకి తీసుకొచ్చిన ఉమ్మడి ప్రయాణ పాస్ (కామన్‌పాస్)కు ఆదరణ అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. పాస్ విధానాన్ని ప్రయాణికులు స్వాగతిస్తున్నప్పటికీ.. నిర్ణయించిన ధరలు మాత్రం సామాన్యులకు అందుబాటులో లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రోజువారీ, నెలవారీ పాస్‌ల ధరలను తగ్గించాలని పలువురు కోరుతున్నారు. కొత్త విధానం అమల్లోకి వచ్చిన తొలి రెండు రోజుల్లోనే తక్కువ సంఖ్యలో పాస్‌లు విక్రయించడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు.మెట్రో, ఆర్టీసీ మధ్య అనుసంధానాన్ని మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఈ కామన్‌పాస్‌ను ప్రవేశపెట్టారు. గాంధీ జయంతి సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి పాస్ విధానాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రయాణికుల నుంచి వచ్చే స్పందనను బట్టి ధరలను పునఃపరిశీలించే అవకాశం ఉందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం రోజువారీ కామన్‌పాస్ ధర రూ. 400గా ఉంది. ఇందులో మెట్రో వాటా రూ. 300 కాగా, ఆర్టీసీకి రూ. 100 కేటాయించారు. నెలవారీ పాస్‌కు రూ. 8,500 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ. 7,000, ఆర్టీసీ సేవలకు రూ. 1,500గా ధరను నిర్ణయించారు. ఈ మొత్తం తమకు భారంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.

**-మెట్రో వాటాతోనే పాస్ ధర పెరిగింది**

కామన్‌పాస్ ధర ఎక్కువగా ఉండటానికి ప్రధాన కారణం మెట్రో చార్జీలేనని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఆర్టీసీ ఏసీ బస్సులకు నెలవారీ పాస్ రూ. 2,200గా ఉంది. అయితే కామన్‌పాస్‌లో ఆర్టీసీ వాటాను రూ. 1,500కే పరిమితం చేశామని అధికారులు వివరిస్తున్నారు. తమ పరిధిలో సాధ్యమైనంత మేర ధరను తగ్గించామని, మిగిలిన మొత్తం మెట్రో వాటాగా వెళ్తోందని చెబుతున్నారు. ఇప్పటి వరకు మెట్రోలో నెలవారీ పాస్ విధానం లేదు. ప్రభుత్వం సూచించడంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు మెట్రో సంస్థ అంగీకరించింది. అయితే పాస్‌లో తన వాటాను రూ. 7,000గా నిర్ణయించడంతో మొత్తం ధర భారీగా పెరిగింది. తొలుత మెట్రో వాటాను రూ. 6,000గా ప్రతిపాదించినప్పటికీ.. చివరికి మరో రూ. 1,000 పెరగడంతో కామన్‌పాస్ ధర రూ. 8,500కు చేరింది.

**-లెక్కలు చూసుకుంటున్న ప్రయాణికులు**

కామన్‌పాస్ ధరలను సాధారణ ప్రయాణ ఖర్చుతో పోల్చి చూసిన ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల పై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం మెట్రోలో కనిష్ఠ చార్జీ రూ. 11 కాగా, గరిష్ఠ చార్జీ రూ. 69గా ఉంది. ఒకే కారిడార్‌లో రోజుకు వెళ్లి రావడానికి గరిష్ఠంగా రూ. 138 వరకు ఖర్చవుతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న 10 శాతం రాయితీని పరిగణనలోకి తీసుకున్నా ఈ మొత్తమే అవుతుంది. రాయితీ లేకపోతే రోజువారీ వ్యయం మరింత పెరుగుతుంది. నెలలో సగటున 25 రోజుల పాటు కార్యాలయానికి వెళ్లే ప్రయాణికుడిని




పరిగణనలోకి తీసుకుంటే.. రోజుకు గరిష్ఠంగా రూ. 150 చొప్పున లెక్కించినా నెలవారీ మెట్రో ప్రయాణ వ్యయం సుమారు రూ. 3,750కు చేరుతుంది. అయితే కామన్‌పాస్‌లో మెట్రో వాటా మాత్రమే రూ. 7,000 ఉండటాన్ని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

**-బైక్‌తో పోలిక..**

ఇక రోజూ వ్యక్తిగత వాహనాలపై కార్యాలయాలకు వెళ్లే వారు కూడా కామన్‌పాస్ ధరను తమ ప్రయాణ ఖర్చుతో పోల్చి చూస్తున్నారు. రోజుకు సుమారు 50 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వ్యక్తికి నెలవారీ పెట్రోల్ వ్యయం రూ. 3,000 లోపే ఉంటుందని చెబుతున్నారు. దీనికి అదనంగా సొంత వాహనంతో ఇంటి నుంచి నేరుగా గమ్యస్థానానికి చేరుకునే సౌకర్యం కూడా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రజారవాణాను మరింతగా ప్రోత్సహించాలంటే పాస్ ధరలు కూడా సామాన్య ప్రయాణికుడికి అందుబాటులో ఉండేలా నిర్ణయించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న కామన్‌పాస్‌పై ప్రజల స్పందనను ప్రభుత్వం పరిశీలించి, ధరల విషయంలో ఏదైనా మార్పు చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

# అంబేద్కర్ సంఘం ఎన్నిక రద్దు

**- జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్.**


తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం
క్యాదాసి ప్రభాకర్
సెల్: 95500 92216

కరీంనగర్ నగర పాలక సంస్థ రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీ బీఆర్ఎస్ ప్యానెల్ గా చెప్పుకుంటూ స్థానిక పార్టీ ముఖ్య నాయకులను కలిసి, సన్మానం అందుకున్నట్లు సోషల్ మీడియాలో పలు చోట్ల పోస్ట్ చేయడం తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలను జోక్యం చేయడమనేది సంఘం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, అసలు ఈ ఎన్నిక ప్రక్రియలో ఏ ప్యానెల్ లేకున్నా బీజేపీ ప్యానెల్ పై బీఆర్ఎస్ ప్యానెల్ గెలిచిందని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీ వెంటనే విచారణ జరిపించి తెలంగాణ అంబేద్కర్ కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదని, ఇలా సంఘం ప్రతిష్ట కు భంగం కలిగించిన నూతన కమిటీపై క్రమశిక్షణ చర్యల్ని తీసుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లుతెలిపారు. ఈ మేరకు నూతన కమిటీ సకాలంలో వివరణ ఇవ్వకుండా జాప్యం చేయడమే కాకుండ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినందుకు చర్యగా ఎన్నికైన కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగిందని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఈ నెల 5న ప్రజావాణి కార్యక్రమం రద్దు

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



నిర్మల్ జిల్లాలో ఈ నెల 5వ తేదీన ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవు తున్నందున జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని, ఈ నెల 12వ తేదీ నుండి యధాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడి చిట్టీల దందా..భార్యాభర్తల అరెస్ట్

**-చిట్టీలు,డెయిలీ కలెక్షన్లు,అధిక రాబడుల పేరుతో రూ.6.24 కోట్ల వసూళ్లు**
**-రూ.3.05 కోట్లకు పైగా బకాయిలు బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి**

ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ భార్యతో కలిసి చిట్టీలు,డెయిలీ కలెక్షన్లు,అధిక రాబడుల పేరుతో భారీగా నగదు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై పోలీసులు భార్యాభర్తలను అరెస్ట్ చేశారు. చివ్వెంల మండలం యెనగండి తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బానోత్ రాజు (44),ఆయన భార్య బానోతు అనూష (33)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఆదివారం సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బానోత్ రాజు 2015 నుంచి తన భార్య అనూష సహకారంతో చిట్టీలు, డెయిలీ కలెక్షన్ల వ్యవహారం నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. అధిక రాబడులు, నెలనెలా చెల్లింపులు ఇస్తామని నమ్మించి ప్రజలు,తోటి ఉద్యోగులు, పరిచయస్తుల నుంచి పెద్ద మొత్తంలో నగదు సేకరించినట్లు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న రాజుపై ఉన్న నమ్మకంతో పలువురు ఆయనకు డబ్బులు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.చిట్టీలతో పాటు భూములు కొనుగోలు చేస్తున్నామని నమ్మించి కూడా పలువురి నుంచి నగదు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.అయితే చిట్టీల గడువు పూర్తైన తర్వాత కూడా కొందరికి డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో బాధితులు నిందితులను నిలదీయడం ప్రారంభించారు. దీంతో ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి వచ్చింది.

**-రూ.6.24 కోట్లు వసూలు..రూ.3.05 కోట్లు బకాయి**

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం..నిందితులు బాధితుల నుంచి మొత్తం సుమారు రూ. 6,24, 50,000 సేకరించినట్లు గుర్తించారు. ఇందులో రూ. 3,18,54,000 తిరిగి చెల్లించగా, ఇంకా రూ. 3, 05,96,000 బకాయిగా ఉన్నట్లు వెల్లడించారు. సేకరించిన మొత్తంలో కొంత డబ్బును వ్యక్తిగత అవసరాలు,ఆస్తుల కొనుగోలుకు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు.మరోవైపు మిగిలిన మొత్తాన్ని సుమారు 500 నుంచి 600 మందికి రూ. 10 వేల నుంచి రూ. 2 లక్షల వరకు అప్పుగా ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. కొంత మొత్తానికి నెలకు 10 శాతం వరకు అధిక వడ్డీ వసూలు చేసినట్లు కూడా పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు.




**-ఆధారాల సేకరణపై దర్యాప్తు**

బాధితుల ఫిర్యాదుతో చివ్వెంల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితుల వద్ద ఉన్నట్లు గుర్తించిన ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్లు, భూముల లావాదేవీలు,నగదు సేకరణ,తిరిగి చెల్లింపులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నామన్నారు.ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే తమ వద్ద ఉన్న ఆధారాలతో చివ్వెంల పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు. చిట్టీలు,అధిక రాబడులు,పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన సూర్యాపేట రూరల్ సీఐ జి.రాజశేఖర్,ఎస్ఐలు వి. మహేశ్వర్,వెంకన్నతో పాటు పోలీసు సిబ్బందిని అభినందించారు.

# పంజాగుట్ట--జూబ్లీహిల్స్ మధ్య భారీ ఎలివేటెడ్ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్

**-4 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల ఫ్లైఓవర్..ట్రాఫిక్ రద్దీకి చెక్**
**-కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్ల ప్రతిపాదనకు బ్రేక్**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక అడుగు పడింది.పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. నగరంలోని అత్యంత రద్దీ మార్గాల్లో ఒకటైన ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలను వేగవంతం చేయడంతో పాటు ప్రయాణ సమయాన్ని తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా అధికారులు భావిస్తున్నారు.

**-ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్**

పంజాగుట్ట,బంజారాహిల్స్,జూబ్లీహిల్స్ ప్రాంతాలు నగరంలోని ప్రధాన వాణిజ్య,నివాసప్రాంతాలకు అనుసంధానంగా ఉండటంతో నిత్యం భారీగా వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. ముఖ్యంగా పీక్ అవర్స్‌లో పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుంది.ఈ సమస్యకు పరిష్కారంగా పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయించింది. సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ భారీ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ఈ మార్గంలో వాహనాల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

**-మేఘా సంస్థకు నిర్మాణ బాధ్యతలు**

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను మేఘా సంస్థకు అప్పగించినట్లు సమాచారం.ప్రాజెక్టు నిర్మాణంలో ఆధునిక ఇంజినీరింగ్ పద్ధతులను వినియోగించడంతో పాటు,ప్రస్తుతం ఉన్న రహదారులపై ట్రాఫిక్ ప్రవాహానికి అంతరాయం కలగకుండా పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో భూస్థాయిలోని ప్రధాన కూడళ్లపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు, సిగ్నళ్ల వద్ద వాహనాలు నిలిచే సమయం కూడా తగ్గే అవకాశం ఉంది.

**-కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లకు బ్రేక్**

ఇదిలా ఉండగా,కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు,స్టీల్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించాలన్న పాత ప్రతిపాదనలకు జీహెచ్ఎంసీ బ్రేక్ వేసింది.కేబీఆర్ పార్క్ పరిసరాల్లో అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానం వల్ల ఇప్పటికే ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గిందని అధికారులు అంచనా వేశారు.దీంతో భారీ వ్యయంతో అదనపు స్టీల్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించాల్సిన అవసరం లేదనే నిర్ణయానికి జీహెచ్ఎంసీ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన నిర్మాణాలకు సంబంధించిన పాత ఒప్పందాలను కూడా రద్దు చేసినట్లు సమాచారం.

**-అవసరమైన చోటే మౌలిక వసతులు**

నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి భారీ నిర్మాణాలే ఏకైక మార్గం కాదని,ఇప్పటికే ఉన్న రహదారులు,వన్‌వే విధానాలు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలను సమర్థంగా వినియోగించడం ద్వారా కూడా రద్దీని నియంత్రించవచ్చనే అభిప్రా యంతో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.అదే సమయంలో వాహనాల రద్దీ అధికంగా ఉన్న పంజాగుట్ట- జూబ్లీహిల్స్ మార్గంలో మాత్రం భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టడం ద్వారా దీర్ఘకాలికంగా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు.ఈ ప్రాజెక్టు పూర్తయి అందుబాటులోకి వస్తే పంజాగుట్ట,బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల మధ్య ప్రయాణించే వేలాది వాహనదారులకు ప్రయోజనం కలగడంతో పాటు నగరంలోని కీలక మార్గాల్లో ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.



# సంపాదకీయం

## రామ జన్మభూమి ఉద్యమం నుంచి సామాజిక సమరసత వరకు




భారతావనిలో ఒక నవయుగం ప్రభవిస్తోంది. దేశమంతా కొత్త ఆత్మవిశ్వాసంతో అద్భుతమైన సమాజ నిర్మాణంలో నిమగ్నమయింది. ఎందరో ఉదాత్తులు దశాబ్దాల పాటు అంకితభావంతో శ్రమించి ఆ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. మాన్యులు అశోక్ సింఘాల్ అటువంటి మహానుభావులలో అగ్రగణ్యులు. విశ్వహిందూ పరిషత్‌కు దేశమంతటా చుక్కానిలా నిలిచిన మహనీయుడు ఆయన. అందుకే సింఘాల్‌ను 'హిందూ హృదయ సమ్రాట్' అని, 'రామ జన్మభూమి ఉద్యమకర్త' అని, 'హిందూ పునరుజ్జీవన నాయకుడు' అని, 'రాష్ట్ర జాగరణ్ అభియాన్ సేనాపతి' అని పిలుస్తుంటారు. కానీ, అశోక్ జీ వ్యక్తిత్వాన్ని కేవలం ఒక్క పదంలో పరిచయం చేయాల్సి వస్తే, ఆ పదం--కర్మయోగి. అశోక్ సింఘాల్ నిష్కామ భావంతో కర్తవ్యాన్ని నిర్వర్తించేవారు. ఏదైనా పనిలో విజయం సాధిస్తే దాని క్రెడిట్ తాను తీసుకోవడానికి బదులుగా ఈశ్వరునికి సమర్పించేవారు. ఆ విజయంతో లభించే ప్రచారానికి ప్రాధాన్యమివ్వకుండా ప్రశాంతంగా ఉండేవారు. కీర్తి శిఖరాలకు చేరుకున్న తర్వాత కూడా ఆయన ఎన్నడూ ప్రచారం కోరుకోలేదు. జయాపజయాలకు అతీతంగా సమభావంతో నడవడం అనేది ఒక కర్మయోగి అయిన స్వయంసేవక్ లక్షణం. ఇది అశోక్ జీ (రాంప్రశీని రాఅఅస్త్రష్ఖుశ్రీ) జీవితంలో స్పష్టంగా కనిపించేది. అశోక్ జీ అసాధారణ ప్రతిభాశాలి. తన మేధస్సును దేశ అభ్యున్నతి కోసం అంకితం చేశారు. ఒక ఉన్నత కుటుంబంలో సింఘాల్ జన్మించారు. ఆయన సోదరుడు ఐపీఎస్ ఆఫీసర్. ఉత్తరప్రదేశ్‌కు డీజీపీగా సేవలు అందించారు. ఇతర సోదరులు విజయవంతమైన పారిశ్రామి కవేత్తలు. అశోక్‌జీ కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుంచి మెటలర్జికల్ ఇంజినీరింగ్ డిగ్రీ తీసుకున్నారు. ఈ నేపథ్యంతో కోటీశ్వరుడు అయ్యేం దుకు అవకాశాలు ఉన్నా ఆయన తన జీవితాన్ని దేశం కోసమే పూర్తిగా అంకితం చేశారు. అశోక్ జీ స్వతస్సిద్ధంగా ఆధ్యాత్మిక స్వభావుడు. స్వామి వివేకానంద లాగే ఆయన కూడా తానేదో ఒకటి పొందాలని ఆశించ కుండా, సమాజ శ్రేయస్సుకు తన జీవితాన్ని అర్పించారు. అశోక్ జీ విద్యార్థి దశలోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)తో పరిచయం కలిగి ఉన్నారు. ఆ తొలిదశలో, పూజ్యులు ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ ('రజ్జు భయ్యా') మార్గదర్శకత్వాన్ని ఆయన పొందారు. మాన్యులు దేవరస్ ఒక నిపుణుడైన శిల్పిలా సింఘాల్ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దారు. ఆయనకు పూజ్య గురూజీ మార్గదర్శకత్వం నిరంతరం లభిస్తూ వచ్చింది. అంకితభావం, కష్టపడే తత్త్వం, దృఢ సంకల్పం, నిర్వహణ నైపుణ్యం, సంఘటన కుశలతతో అద్భుతమైన నాయకుడుగా అశోక్ జీ రాణించారు. ఇంజనీ రింగ్ విద్య పూర్తికాగానే ఆయన సంఘ్ ప్రచారక్ అయ్యారు. ఆయనకు ఏ బాధ్యత అప్పగించినా దానిని పూర్తి నిబద్ధతతో నిర్వహిం చారు. ఆ బాధ్యత కోసమే సింఘాల్ పుట్టారేమో అనిపించేది. అశోక్ జీ ఢిల్లీ ప్రాంత్ ప్రచారక్‌గా ఉన్న సమయంలో, మీనాక్షిపురం మతమార్పిడి ఘటన సంభవించింది. హిందూ సమాజ సమగ్ర జాగృతి అవసరం ఎంతైనా ఉందని పెద్దవాళ్లంతా భావించారు. ఢిల్లీలో విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహించే బాధ్యతను అశోక్ జీకి అప్పగించారు. సమాజంలోని వివిధ వర్గాలను అనుసంధానిస్తూ ఆ సమ్మేళనాన్ని ఆయన విజయవంతం చేశారు. ఆ తర్వాత, ధార్మిక, సామాజిక రంగంలో విస్తృత జాగృతికి అంకితమైన విశ్వ హిందూ పరిషత్ సారథ్య బాధ్యత లభించింది. ఆయన ఈ బాధ్యతను కూడా అదే అంకితభావంతో నిర్వర్తించారు. సమాజ పరిస్థితులను అర్థం చేసుకోవడం, దానికి తగినట్లుగా ఆలోచించడం, ప్రణాళికలు రూపొంది ంచడం, వాటిని ఆచరణలో పెట్టడం... ఇది ఆయన కార్యశైలి. హిందూ సమాజంలో అస్పృశ్యత అనే దురాచారం శతాబ్దాలుగా ఒక సామాజిక సవాలుగా ఉంటూ వస్తోంది. అస్పృశ్యత తొలగిపోకుండా సమరస సమాజం సాధ్యం కాదు. ఈ విషయాన్ని కేవలం సామూహిక భోజనాలు లేదా నామమాత్రపు కార్యక్రమాలకే అశోక్ జీ పరిమితం చేయలేదు. హిం దూ ధర్మపు ప్రాథమిక ఆదర్శాలకు అస్పృశ్యత విరుద్ధమని చాటి చెప్పారు. ఇందుకు సాధుసంతుల సహకారం తీసుకున్నారు. అశోక్ జీ ప్రోద్బలంతో షెడ్యూల్డ్ కులాల బస్తీలలో సన్యాసులు పర్యటించడం ప్రారంభించారు. తర్వాత కాలంలో ఇది పెద్ద ఉద్యమంగా మారింది. 1989 నవంబర్ 9న అయోధ్యలో రామ జన్మభూమి మందిర శంకుస్థాపన షెడ్యూల్డ్ కులానికి చెందిన కామేశ్వర్ చౌపాల్ చేతుల మీదుగా నిర్వహించారు. ఇందులో అనేకమంది పూజ్య సన్యాసులు ధర్మాచార్యులు పాల్గొన్నారు. సామాజిక భేదాలను తొలగించి సమరస హిందూ సమాజాన్ని నిర్మించవచ్చుననే నమ్మకాన్ని సమాజంలో బలపరచడంలో ఈ ప్రయత్నాలు తోడ్పడ్డాయి. రామ జన్మభూమి ఉద్యమం స్వతంత్ర భారతదేశ ధార్మిక ఉద్యమాలలో ప్రధానమైనది. 1980 నుంచి 2019 సుప్రీంకోర్టు తీర్పు, ఆ తర్వాత మందిర నిర్మాణం వరకు అందులో అనేక దశలు ఉన్నాయి.

# తెలంగాణ రాజకీయాల్లో రాజ్యాధికారం..సామాజిక ఆధిపత్యం

తెలంగాణ రాజకీయాల్లో ఒక స్పష్టమైన నమూనా కనిపిస్తోంది. అధికారం, ప్రతిపక్షం, మూడో శక్తి..ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ముఖ్యమంత్రి పదవి, కీలక నిర్ణయాధికారం ఎక్కువగా కొన్ని సామాజిక వర్గాల చేతి లోనే కొనసాగుతోంది. ఇది కేవలం అభిప్రా యం కాదు. జనాభా లెక్కలు, అసెంబ్లీ కూర్పు, మం త్రివర్గాలు, చారి త్రక నమూనాలు చూస్తే ఈ చిత్రం స్పష్టంగా కనిపి స్తుంది.

### -తెలంగాణ కుల సర్వే 2024-25-జనాభా వాస్తవాలు

తాజాగా రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక-ఆర్థిక-విద్యా-ఉపాధి-రాజకీయ-కుల సర్వే ప్రకారం. బీసీలు సుమారు 56%,ఎస్సీలు సుమారు 17%, ఎస్టీలు సుమారు 10%,ఇతర కులాలు (ఓసీలు) సుమారు 12-15% వరకు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మెజారిటీ సామాజిక వర్గాలు కలిసి రాష్ట్ర జనాభాలో 80% కంటే ఎక్కువ ఉన్నాయి. ఇందులో ప్రధానంగా అధికారాన్ని అనుభవించే రెడ్డి సమాజం సుమారు 4.8 %, వెలమ సమాజం 0.4% వరకు మాత్రమే ఉన్నాయి. కమ్మ,మున్నూరు కాపు (సాంకేతికంగా బీసీలుగా ఉన్నా సామాజికంగా ఓసీలుగా చలామణి) వంటి వర్గాలు కూడా సంఖ్యా పరంగా చిన్నవే. అయినప్పటికీ భూమి యాజమాన్యం, ఆస్తులు,రాజకీయ ప్రాతినిధ్యం వీరి వైపే ఎక్కువగా ఉన్నట్లు సర్వే సూచిస్తోంది. రెడ్డిలు 4.8% జనాభాతో రాష్ట్ర భూమిలో 13.5% వాటా కలిగి ఉన్నారని డేటా చెబుతోంది.

### -పార్టీల్లో నాయకత్వ నమూనా

కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులతో పార్టీలో రెడ్డి నాయకత్వం బలంగా కనిపిస్తుంది. అసెంబ్లీలో రెడ్డి ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కు వగా ఉండటం సాధారణం. బీఆర్‌ఎస్ (గత టీఆర్ ఎస్) పార్టీకి అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెలమ సామాజిక వర్గం. ఈ సమాజం నుంచే పార్టీ నాయకత్వం, కీలకపదవుల్లో వ్యక్తుల ప్రభావం స్పష్టం. గత ఎన్నికల్లో కూడా వెలమ, రెడ్డి అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చిన ఉదా హరణలు ఉన్నాయి. ఇక బీజేపీలో రెడ్డి,వెలమ, మున్నూరు కాపు వంటి వర్గాల నాయకులు ముందు న్నారు. రాష్ట్రంలో పార్టీ విస్తరణకు తీవ్రంగా ప్రయత్ని స్తున్న ప్పటికీ, టాప్ లెవల్‌లో ఈ నమూనా కనిపిస్తోంది. ఇకపోతే అక్కడక్కడా గెలుపు ఓటములను ప్రభావితం చేసే కేడర్ ఉన్న కమ్యూనిస్టు పార్టీలు కూడా కమ్మ,రెడ్డి నాయకత్వంలో ఎక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రంలో కేవలం బీఎస్పీ మాత్రమే ఎస్సీల నాయక త్వంలో ఉన్నా, రాష్ట్ర స్థాయి లో ఓటు బ్యాంకు బలహీ నంగా ఉండటం వల్ల దాని ప్రభావం పరిమితం.

### -అధికారం ఎవరిదైనా అనుభవించేది ఆ వర్గాలే

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ముఖ్యమంత్రి పదవి ఇప్పటివరకు రెడ్డి లేదా వెలమ వర్గాల నుంచే వచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ లేదా మైనారిటీ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించి,గెలిచిన తర్వాత ఆ వ్యక్తినే ముఖ్య మంత్రిగా నిలబెట్టే పరిస్థితి ఇప్పటివరకు లేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో టిఆర్‌ఎస్ పార్టీ దళితుడిని ముఖ్య మంత్రిని చేస్తానని ప్రకటించినా. తెలంగాణ రాష్ట్ర ఆవి ర్భావ అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో అధికారాన్ని చేపట్టి దళిత ముఖ్యమంత్రి పదవిని తుంగలో తొక్కింది. అప్పుడు,ఇప్పుడు కూడా మంత్రివర్గాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కొంత ప్రాతినిధ్యం ఇచ్చినప్పటికీ, అత్యున్నత నిర్ణయాధికారం ఒకే రకమైన సామాజిక వర్గాల చేతిలోనే ఉంటోంది.

### -ఓటు బలం వర్సెస్ అధికారం

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిసి ఎన్నికల్లో నిర్ణయా త్మక ఓటు బ్యాంకుగా పనిచేస్తాయి. ఏ పార్టీ నైనా అధికా రంలోకి తీసుకురావడానికి వీరి మద్దతు అవసరం. అయినా అధికారం అనుభవించేది ప్రధా నంగా సంఖ్యా పరంగా చిన్నవైనా,చారిత్రకంగా భూమి, వనరులు, సంస్థా గత బలం కలిగిన ఆధిపత్య వర్గాలదే. ఇది బీసీ,ఎ స్సీ, ఎస్టీ,మైనార్టీ వర్గాలను "ఓటు యంత్రాలు"గా చూడ టం వర్సెస్ "నాయకులు"గా గుర్తించడం మధ్య ఉన్న అంతరం. ఆధిపత్య వర్గాలు (రెడ్డి, వెలమ, కమ్మ, మున్నూరు కాపు వంటివి) వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ తమ సామాజిక వర్గ సమావేశాల్లో సమన్వయం చేసుకు ంటాయి. అదే సమయంలో బీసీల్లోని వివిధ ఉపవర్గాలు, ఎస్సీలు (మాల,మాదిగ), ఎస్టీలు (లంబాడా, ఆదివాసీ), మైనారిటీలు తమలో తాము ఏకం కావడం కష్టంగా ఉంటోంది. ఒకే సామాజిక వర్గం వారు వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ సమన్వయం చేసుకోవడం తక్కు వగా కనిపిస్తోంది. ఇది రాజకీయ చైతన్యం, సంస్థాగత ఐక్యత లోపం వల్లనేనని విశ్లేషకులు పేర్కొంటారు.

### -ఎందుకు ఈ పరిస్థితి కొనసాగుతోంది?

చారిత్రక కారణాలను పరిశీలిస్తే.. భూస్వామ్యం, విద్య, నెట్‌వర్క్‌లు, పార్టీ నిర్మాణంలో ప్రారంభ నుంచే ఆధిప త్యం, వనరుల అసమానత, రాజకీయం, డబ్బు, సంస్థ,ప్రచారం మీద ఆధారపడి ఉంటుంది. ఇవి కొన్ని వర్గాల్లో ఎక్కువగా ఉన్నాయి.

### -అంతర్గత విభజనతో ఐక్యతకు లోపం

బహుజన వర్గాల్లో ఉపకులాలు, ఉప ప్రయోజనాలు, నాయకత్వ పోటీలు ఐక్యతను బలహీనపరుస్తాయి. అందుకే పార్టీలు పార్టీ నిర్మాణం,"గెలుపు సాధ్యత"ను చూసి టిక్కెట్లు,పదవులు ఇస్తాయి. సంఖ్యాబలం కంటే సంస్థాగత బలం,ధనబలం,కుల సంఘటన బలం ప్రాధా న్యం పొందుతాయి. ఈ చిత్రం స్పష్టంగా కనిపి స్తున్నా, మెజారిటీ సామాజిక వర్గాల మేధావులు, ఓటర్లు ఎందుకు దీన్ని ప్రధాన సమస్యగా చర్చించడం లేదు? అధికారం కావాలని చెబుతారు. కానీ,దానికి అవసరమైన ఐక్యత, సంస్థాగత నిర్మాణం,క్రాస్-పార్టీ సమన్వయం ఎందుకు జరగడం లేదు? ఇది అవగా హన లోపమా,చారిత్రక మానసిక భారమా లేక రాజకీయ వ్యవస్థలోని నిర్మా ణాత్మక అడ్డంకులా? ఆయా సామాజిక వర్గాలు ఆత్మ శోధన చేసుకోవాలి. 80 ఏళ్లుగా ఇదే నమూనా కొనసా గుతోంది. మార్పు కోసం కేవలం ఓటు వేయడం సరిపోదు. నాయకత్వ స్థాయిలో ప్రాతినిధ్యం, పార్టీల అం తర్గత ప్రజా స్వా మ్యం, సామాజిక వర్గాల మధ్య సమన్వయం అవస రం. లేకపోతే సంఖ్యాబలం ఉన్నా అధికారం దూరం గానే ఉంటుంది అన్నది ఈ రాజకీయ చిత్రం చెబుతున్న సందేశం. ఇది ఏ పార్టీనీ,ఏసామాజిక వర్గాన్నీ లక్ష్యం చేసుకుని రాయబడిన వ్యాసం కాదు. తెలంగాణ రాజకీయాల్లో కనిపించే నిర్మాణాత్మక నమూ నాను, జనాభా-అధికార అసమతుల్యతను వాస్తవాల ఆధారంగా విశ్లేషించిన ప్రయత్నం మాత్రమే.

✍ గంట సోమన్న,
ధర్మఘంట చీఫ్ బ్యూరో

# చీమలు పెట్టిన పుట్టలు పాములు ఆక్రమించినట్లు?

**-హైదరాబాద్‌లో రూ.50 వేల కోట్ల భూమిపై పెద్దల డేగ కన్ను?**
**-దశాబ్దాలకింద ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన ప్రజలు?**
**-286 ఎకరాల భూమి రాజీ తో కొట్టేసేందుకు కుట్ర?**
**-కూకట్‌పల్లి సర్వేనం1007 లో భూమి అసలు కథ?**
**-ఇళ్ల నిర్మాణ అనుమతులు రాకుండా చక్రం తిప్పారు?**
**-హైటెక్ సిటీ నిర్మాణంతో భూములకు రెక్కలు?**
**-గతంలో ఇదే ఒత్తిడి తెచ్చి బెదిరించి భూమి కైవసం?**
**-ఎన్ని సార్లు విన్నవించినా చలనం లేని అధికారులు?**

భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 286 ఎకరాలను వివాదాస్పదం చేసి ప్రత్యామ్నాయ డాక్యు మెంటు సృష్టించి హక్కులు పొందాలని చూస్తు న్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ కీలక వ్యక్తి, ప్రతిపక్షంలో ఉన్న నేతలు ఉన్నారు.

### -చీమలు పెట్టిన పుట్టల్ని పాములు ఆక్రమించినట్లు?

చీమలు పెట్టిన పుట్టల్ని పాములు ఆక్రమించినట్లు పైసాపైసా కూడబెట్టి సామాన్యులు కొనుకున్న స్థలా లను బడా వ్యక్తులు సొంతం చేసుకునేందుకు కుయు క్తులు చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున రూ.వేల కోట్ల విలువైన భూములను కొట్టేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే కొంతమంది ఇళ్లు నిర్మించుకుని నివసిస్తుండగా, వారిని సైతం బెదిరిస్తున్నారు. ఎలాంటి హక్కులు లేకుండా రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణాలు చేపట్టి రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వ వ్యవస్థలను అదుపులోకి తెచ్చుకు న్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

### -దశాబ్దాలకింద ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన ప్రజలు?

ఎప్పుడో దశాబ్దాల కింద ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు రాజకీయ నేతల ఒత్తిడిలో నలిగిపోతున్నారు. ఈ భూ వ్యవహా రంలో అధికార పార్టీ కీలక వ్యక్తి, ప్రతిపక్షంలో ఉన్న పలువురు నేతలు, పక్క రాష్ట్రానికి చెందిన వైఎస్సార్?సీపీ నేత ఒకరు సూత్ర ధారులుగా ఉన్నట్లు తెలిసింది. భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి చెందిన 286 ఎకరాలను వివాదా స్పదం చేసి ప్రత్యామ్నాయ రిజిస్ట్రేషన్? డాక్యుమెంటు సృష్టించి భూమి హక్కులు పొందాలని చూస్తున్నారు. కోర్టుల పేరుతో తిప్పలు పెడుతున్నారు. ఇప్పటికే 22 ఎకరాలకు సంబంధించి మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ మెంట్? అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు తమకు న్యాయం చేయా లంటూ ఆందోళనకు దిగారు.

### -కూకట్‌పల్లి సర్వేనం1007 లో భూమి అసలు కథ?

హైదరాబాద్?లో నివేశన స్థలాల కోసం కొంతమంది చిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు కలిసి 1961లో భాగ్యనగర్ హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేసి దీని ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్వే నం.1007లో 286 ఎకరాల భూమిని కొనుగోలు చేయడానికి నిర్ణయి ంచుకున్నారు. దీనికి హక్కుదారు నవాబ్ రియాజ్ యార్ జంగ్ అనే వ్యక్తి నుంచి 1974లో కొనుగోలుకు సిద్ధమై వారి వారసుల నుంచి అగ్రి మెంట్ కూడా పొందారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. చివరకు 1991 నుంచి 1998 మధ్య కాలంలో కోర్టు ద్వారా వారికి 70 ఎకరాలు, 50 ఎకరాలు, 25 ఎకరాలు, 22 ఎకరాల చొప్పున మొత్తం 167 ఎకరాలు రిజిస్టర్ అయ్యా యి. మిగిలిన 119 ఎకరాలను రిజిస్టర్ చేయలేదు. ఈ స్థలాల్లో కొంతమంది ఇప్పటికే తమ ఇళ్లను నిర్మించు కున్నారు. కొన్ని ఖాళీగా ఉన్నాయి.

### -హైటెక్ సిటీ నిర్మాణంతో భూములకు రెక్కలు?

మాదాపూర్‌లో హైటెక్ సిటీ నిర్మాణంతో ఈ ప్రాంతంలో భూముల ధరలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో ఉన్న ఈ భూములపై కొంతమంది బడాబాబుల చూపు పడింది. సొసైటీ భూములను సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో ఫేక్? డాక్యుమెంట్లు సృష్టించారు. ఏపీకి చెందిన ఓ ప్రముఖ సిమెంట్ కంపెనీ అధినేత ఇందు లో ముఖ్య పాత్ర పోషించాడు. జంగ్ తన భూమిని తన దగ్గర సర్వెంట్‌గా పని చేస్తున్న వలీమ్ అహ్మద్‌కు నోటి మాటగా బహుమతిగా ఇచ్చినట్లు, తిరిగి అతని నుంచే కొనుగోలు చేసినట్లు ఓ సాదా కాగితం బయటకు వచ్చింది.
దాన్ని జంగ్ మనవడు హషీమ్ అలీకి రిజిస్టర్ చేయిం చినట్లు అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ఒకటి పుట్టింది. దాన్ని సహారా రియల్ ఎస్టేట్ సంస్థకు 1973లో పార్టనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేసినట్లు అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్ తెర మీదకు వచ్చింది. వాస్త వానికి జంగ్ కుటుంబంలో హషీమ్ అలీ అనే వ్యక్తి అసలు లేనే లేరు. రెవెన్యూ రికార్డుల్లోనూ ఎక్కడా అతని పేరు కూడా లేదు. సహారా సంస్థ నుంచి 2000లో ఈ భూములను ప్రైమ్ ప్రాపర్టీస్‌కు ట్రాన్స్? ఫర్? చేయించారు.

### -ఇళ్ల నిర్మాణ అనుమతులు రాకుండా చక్రం తిప్పారు?

2014లో రాష్ట్ర విభజన తర్వాత పూర్తిగా సినిమా మారింది. తెరవెనుక ఉన్న సిమెంట్ కంపెనీ అధినేత కుటుంబ కారణాల రీత్యా ఈ వ్యవహారం నుంచి వెళ్లిపోయారు. తర్వాత ఓ వైసీపీ నేత మెయిన్? లీడ్? గా మారారు. ఎలాంటి రెవెన్యూ రికార్డులు లేకుండా భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీని చాలా ఇబ్బందులు పెట్టారు. భాగ్యనగర్ వాసులకు జీహెచ్‌ఎంసీ నుంచి ఇళ్ల నిర్మాణానికి పర్మిషన్లు రాకుండా పెద్దలు చక్రం తిప్పారు. ప్రస్తుతం కేసు మేడ్చల్ జిల్లా కోర్టులో ఉన్నప్పటికీ ప్రైమ్ ప్రాపర్టీస్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఈ 286 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేస్తామని పిటిషన్ దాఖలు చేసింది. టైటిల్ ఎవరిదనేది ఇంకా కోర్టు నిర్ణయించకుండానే ప్రహరీ నిర్మాణానికి సుప్రీం అనుమతి ఇచ్చిందని ఏకంగా బ్లూషీట్స్‌తో రాత్రికి రాత్రి వేగంగా నిర్మాణం చేపట్టారు. స్థలాల యజమానులైన సొసైటీ సభ్యులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. తాజాగా 286 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పూనుకు న్నారంటే అక్కడి రెవెన్యూ అధికారుల నుంచి ఏస్థాయి లో సహాయ సహకారాలు అందుతున్నాయో? ఇక్కడ అర్థం చేసుకోవచ్చు.

### -ఇదే రకమైన ఒత్తిడి తెచ్చి బెదిరించి భూమి కైవసం?

ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా దాదాపు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు రేట్? పలుకుతుంది. 286 ఎకరాలు అంటే ఈ ఆస్తి విలువ రూ.50 వేల కోట్ల పైనే ఉండటం గమనార్హం. భాగ్యనగర్ సొసైటీ సభ్యుల్లో చాలామంది వృద్ధులు ఉన్నారు. కొంతమంది చనిపోయారు కూడా. ఇప్పుడు వారి వారసులు ఉన్నారు. తమ స్థలాల కోసం వారు న్యాయస్థానాల చుట్టూ తిరిగి పోరాటం చేయలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో ఈ బడా వ్యక్తులు కొంతమందిని మధ్యవర్తులుగా రంగంలోకి దించి కేసులు వెనక్కి తీసుకుంటే రాజీ కుదుర్చు కుంటా మంటూ బేరసారాలు కొనసాగిస్తున్నారు. దీంతో 22 ఎకరాలకు సబంధించి సెటిల్‌మెంట్ జరిగినట్లు మిగిలిన వారిపై కూడా ఇదే రకమైన ఒత్తిడి తెచ్చి భూమి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నట్లు తెలిసింది.

### -ఎన్ని సార్లు విన్నవించినా అధికారుల్లో చలనం లేదు

ఈ వివాదంపై భాగ్యనగర్ సొసైటీ సభ్యులు కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ఎన్ని విన్న పాలు చేసినా ఆ అప్లికేషన్లన్నీ చెత్తబుట్టలోకే వెళ్లిపో తున్నాయి. కనీసం విచారణ కూడా చేయడం లేదని సభ్యులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ కారుడ్రై వర్‌ను జంగ్ వారసుడుగా సొసైటీ సభ్యులు గుర్తిం చగా ఆ వ్యక్తి ఇటీవల కాలంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం గమనార్హం.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com